మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట

# ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి: జిల్లా కలెక్టర్

**నారాయణపేట ప్రతినిధి,డిసెంబరు 01 ప్రభాతవార్త :** జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా జరిగాయని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ ప్రక్రియ పూర్తయిందని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కోయ శ్రీహర్ష వెల్లడించారు. గురువారం జరిగిన పోలింగ్ సందర్భంగా నారాయణపేట నియోజకవర్గ పరిధిలో 78.36 శాతం, మక్తల్ 77.13 శాతం ఓటు వేయడం జరిగిందని పేర్కొన్నారు. 554 పోలింగ్ కేంద్రాలలో జిల్లా యంత్రాంగం, పోలీసుల సహకారంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగిందని పేర్కొన్నారు. ఓటర్లను చైతన్యవంతం చేసే కార్యక్రమాలలో భాగంగా, ప్రజల్లో ఓటుయొక్క ఆవశ్యకతను వివరించడం జరిగిందన్నారు. యువతకు సంబంధించిన మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. ఇక పోలింగ్ ప్రక్రియను నిరంతరం క్షణక్షణం పర్యవేక్షణ గావించడానికి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నియోజకవర్గం వారిగా వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేసి పర్యవేక్షణ గావించడం జరిగిందని, ఏ చిన్న లోటుపాట్లు ఉన్నా కూడా వెంటనే గుర్తించిన అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు సరిచేయడం జరిగిందని పేర్కొన్నారు. మైక్రో అబ్జర్వర్లను నియామకం గావించి ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు నారాయణపేట జిల్లాలో శాసనసభ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను అందరి సహకారంతో విజయవంతం చేయగలిగామని ఇందుకుగాను సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈవీఎంలను గట్టి భద్రత నడుమ గురువారం రాత్రి వరకు దత్త కళాశాలకు తరలించడం జరిగిందన్నారు. జనరల్ పరిశీలకులు బిసి చౌహాన్ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో ఈవిఎం స్ట్రాంగ్ రూమ్ సీల్‌వేసి మూసి వేయడం అయిందని తెలిపారు. ఈ నెల 3న ఎన్నికల లెక్కింపు కొరకు దత్త కాలేజీలో కౌంటింగ్ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇట్టి సమాచారాన్ని సీఈఓ అధికారికి పంపినట్లు కలెక్టర్ తెలిపారు. లెక్కింపు కేంద్రంలో మూడంచల భద్రత ఏర్పాటు చేసి సిసి కెమెరాల పర్యవేక్షణలో జరుగుతుందని ఇందుకుగాను బారికేడ్లు ఇతర ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

# లెక్కింపు కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు : జిల్లా కలెక్టర్

**గద్వాల ప్రతినిధి డిసెంబర్ 1 ప్రభాతవార్త:** ఈ నెల 3న జరిగే సాధారణ ఎన్నికల్లో లెక్కింపు కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికలఅధికారి, జిల్లాకలెక్టర్ వల్లూరుక్రాంతి, సాధారణ పరిశీలకులు పి.వసంతకుమార్ తెలిపారు. శుక్రవారం గోనుపాడు పాలిటెక్నిక్ కళాశాలలో జనరల్ పరిశీలకులు వసంతకు మార్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఈవీఎం స్ట్రాంగ్ రూములోని ఈవీఎంలను రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి సీల్ వేసి భద్రపర చడం జరిగిందని తెలిపారు. అలంపూర్, గద్వాల్ నియోజకవర్గాలకు సంబంధించి ఈవీఎంలను భద్రపరచడం జరిగిందని తెలిపారు. రాజకీయపార్టీల ఏజెంట్లు ఫారం 18ద్వారా దరఖాస్తు చేసుకుని ఐడి కార్డులు తప్పనిసరిగా పొందాలన్నారు. వారు ఇచ్చిన పేర్ల ద్వారా ఇచ్చిన ఐడి కార్డులు ఉన్న వారినే లెక్కింపు కేంద్రంలో అనుమతి ఇస్తారని తెలిపారు. 3వ తేది ఉదయం ఏడు గంటలకు ఏజెంట్లు చేరుకుని వారు స్థానాలలో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అపూర్వ చౌహన్, చీర్ల శ్రీనివాస్, ఆర్‌డిఓ చంద్రకళ, అదనపు ఎస్పి రవి, గద్వాల రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



# రెండవ రాండమైజేషన్ విజయవంతం..

**జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్**

**వనపర్తి ప్రతినిధి,డిసెంబర్ 1,ప్రభాత వార్త :** వనపర్తి నియోజకవర్గంలో కౌంటింగ్ సిబ్బంది రెండవ రాండమైజేషన్ విజయవంతమైందని జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. డిసెంబర్ 3 నాడు జరిగే కౌంటింగ్ నిర్వహణకు కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వ్లను వనపర్తి నియోజకవర్గ సాధారణ పరిశీలకులు సోమేష్ మిశ్రా, జిల్లా ఎన్నికలఅధికారి తేజస్‌నందలాల్ పవార్ సమక్షంలో శుక్రవారం చిట్యాల ఏఎంసి గోదాంలో ఆన్లైన్ వెబ్ ద్వారా రెండవ ర్యాండమైజేశన్ పూర్తి చేశారు. దీనితో వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గానికి కౌంటింగ్ సిబ్బంది కేటాయింపు పూర్తి అయినట్లు కలెక్టర్ తెలిపారు. రెండవ ర్యాండమైజేషన్ ద్వారా సిబ్బందినఇ14 టేబుల్స్‌కోసం సిబ్బందిని కేటాయించడంద్వారా సిబ్బందికి 14 టేబుల్స్ కోసం సిబ్బందిని కేటాయించడం జరుగుతుందన్నారు. 20శాతం అదనపు సిబ్బందితో కలుపుకొని 22కౌంటింగ్ సూపర్వైజర్లు, 25 కౌంటింగ్ అసిస్టెంట్లు, 23 మైక్రోబ్సర్వర్లు కౌంటింగ్ టీం ఉంటుందని తెలియజేశారు. నోడల్ అధికారులు, ఈ.డి.యం.విజయ్, ర్యాండమైజేషన్ సందర్బంగా ఉన్నారు.



# స్ట్రాంగ్ రూముల వద్ద మూడంచల భద్రత..

**సిసి కెమెరాలు, కేంద్ర సాయుధ బలాగాలు, జిల్లా పోలీసులతో**
**పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు:జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్**

**నారాయణపేట ప్రతినిధి,డిసెంబరు 01 ప్రభాతవార్త :** అసెంబ్లీ ఎన్నికల అనంతరం నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాల నుండి పోలింగ్ సామాగ్రి ఈ వీంలు, వివి ప్యాట్లు అత్యంత పటిష్టమైన భద్రత మధ్య జిల్లా కేంద్రంలోని శ్రీదత్త బృందావనం కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల నందు భద్రపరచడం జరిగింది. పటిష్టమైన రక్షణ చర్యల్లో జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ మూడంచల భద్రతను ఏర్పాటు చేసి పోలీసు అధికారులకు బందోబస్తు పర్యవేక్షణ బాధ్యతలను అప్పగిస్తూ సిబ్బందికి సూచనలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూమ్ వద్ద ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన భద్రతను పరిశీలించడం జరిగింది. మూడంచల భద్రతల మధ్య అత్యంత సురక్షితంగా ఈవిఎంలు, వివి ప్యాట్లను రక్షణ కల్పిస్తున్న కేంద్ర బలగాలు, పోలీసులు, జిల్లా సాయుధ సిబ్బంది అనుక్షణం కంటికి రెప్పలా పహారా కాస్తుంటారని తెలియజేశారు. ఎలాంటి నిర్లక్ష్యానికి అవకాశం లేకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలను తీసుకుంటున్నట్లు, సిసి కెమెరాలు పనితీరును కమాండ్ కంట్రోల్ – మిగతా3లో..



# ఈవిఎంలను స్ట్రాంగ్ రూమ్‌కు తరలింపు : జిల్లా కలెక్టర్



**గద్వాల ప్రతినిధి డిసెంబర్ 1 ప్రభాతవార్త:** ప్రియదర్శిని డిగ్రీ కళాశాల నుండి ఉదయం పోలింగ్ అనంతరం వచ్చిన ఈవీఎంలను పోలీసు భద్రత, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల అందరి ఆధ్వర్యంలో సీల్ చేసి గోనుపాడు పాలిటెక్నిక్ కళాశాల స్ట్రాంగ్ రూమ్‌కు తరలించడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా వల్లూరు క్రాంతి తెలిపారు. ఈ నెల మూడు న జరిగే ఎన్నికల లెక్కింపు కార్యక్రమానికి ఈవిఏం లను స్థానిక పోలీసులు, ఆర్మడ్ రిజర్వ్, కేంద్ర బలగాలతో స్ట్రాంగ్ రూమ్‌కు తరలించడం జరిగిందని తెలిపారు. కలెక్టర్ తో పాటు గద్వాల్ రిటర్నింగ్ అధికారి అపూర్వ చౌహాన్, గద్వాల్, తాహసిల్దార్ నరేందర్, పోలీస్, సంబంధిత అధికారులు ఉన్నారు.

# ఉత్కంఠ..!



**- ఎన్నికల ఫలితాలపైనే సర్వత్రా చర్చ**
**- ఎక్కడెక్కడ , ఎవరెవరు గెలుస్తారంటూ గుసగుసలు**
**- ఉమ్మడి పాలమూరులో పుంజుకున్న కాంగ్రెస్**
**- 8నుంచి 10 స్థానాల్లో ఆధిక్యంలో ఉండే అవకాశం**
**- నాలుగు స్థానాల్లో పోటాపోటీ.. - ఎవరు గెలిచినా స్వల్ప మెజార్టీయే.. ?**

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్ 1, ప్రభాతవార్త:** రాష్ట్ర శాసన సభ ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. ఏ పల్లె, ఏ గల్లీ ఎక్కడ చూసినా ఇదే చర్చ జరుగుతున్నది. ఎక్కడ ఎవరు గెలుస్తారంటూ అవే గుసగుసలు వినిపిస్తున్నాయి. గత ఎన్నికల ఫలితాలతో పోలిస్తే ఈసారి టఫ్ ఫైట్ జరిగిందని చెప్పవచ్చు. ఉమ్మడి పాలమూరులోని 14అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ముందంజలో ఉన్నట్లు సర్వేల ద్వారా తెలుస్తున్నది. అయితే ఎవరు గెలిచినా స్వల్ప మెజార్టీ వచ్చే అవకాశం ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో పలు పోలింగ్ కేంద్రాల్లో 9వరకు పోలింగ్ కొనసాగింది. దేవరకద్రలో అత్యధిక పోలింగ్ శాతం నమోదైంది. జడ్చర్లలో 81.18శాతం, మహబూబ్‌నగర్‌లో 70.41శాతం, దేవరకద్రలో అత్యధికంగా 82.33శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు.

**హస్తం హవా..** ఉమ్మడి పాలమూరు జిల్లాలో హస్తం హవా కొనసాగే అవకాశం ఉన్నట్లు ఎగ్జిట్ పోల్స్ ద్వారా అర్థమవుతున్నది. మొదటి నుంచి పాలమూరు జిల్లా పై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత రెడ్డి ఫోకస్ పెట్టిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో ప్రతి సమావేశంలో సభల్లో కూడా ఉమ్మడి జిల్లాలో 14స్థానాలు క్లీన్ స్వీప్ చేయాలంటూ ఓ వైపు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూనే ప్రజలకు ఈ విషయం చెబుతూనే వస్తున్నారు. పాలమూరు బిడ్డగా ఆశీ ర్వదించాలని కోరుతూ వచ్చారు. అభ్యర్థులకు టికెట్ విషయంలోనూ జాగ్రత్తలు తీసుకొని గెలుపు గుర్రాలకే టికెట్ కేటాయించడం ఇందుకు మరింత బలం చేకూరిందని చెప్పవచ్చు. మక్తల్ లాంటి ప్రాంతంలో బీసీ ప్రాబల్యం ఉండడంతో పార్టీలో పేరున్న వాకిటి శ్రీహరికి కేటాయించడం, వనపర్తిలో సీనియర్ అయినా అక్కడ గెలుపు ఇబ్బంది అని భావించి చివరి నిమిషంలో టికెట్ మేఘారెడ్డికి కేటాయించడంతో టఫ్ ఫైట్ కొనిసాగినట్లు తెలుస్తున్నది. ఇలా గద్వాల, కల్వకుర్తి, మహబూబ్‌నగర్‌లో కూడా ఆలోచించి బాగా పట్టున్న నేతలకు సీట్లు కేటాయించడంతో హస్తం ఓ అడుగు ముందే ఉందని చెప్పవచ్చు. ఇలా ఉమ్మడి పాలమూరులో కొడంగల్, కల్వకుర్తి, మక్తల్, కొల్లాపూర్, అచ్చంపేట, నారాయణపేట, అలంపూర్, గద్వాలలో కాంగ్రెస్ ముందంజలో ఉండను న్నట్లు మిగతా స్థానాల్లో కూడా గట్టి పోటీ ఇస్తున్నట్లు ఎగ్జిట్ పోల్స్ ద్వారా తెలుస్తున్నది. అయితే బీఆర్ఎస్ విషయానికొస్తే జడ్చర్ల, దేవరకద్ర, వనపర్తి, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయ ణపేట స్వల్ప మెజార్టీతో ముందుండే అవకాశం ఉండనున్నట్లు సమాచారం.

**ఎవరు గెలిచినా..**
ఏ నియోజకవర్గం చూసినా స్వల్ప మెజార్టీతోనే అభ్యర్థులు గెలిచే అవకాశం ఉండనున్నది. 10వేల మెజార్టీ లోపే అందులోనే కొన్ని స్థానాల్లో వందల లోపే మెజార్టీ ఆశ్చర్యం పోవాల్సిన అవసరం లేదని రాజాకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ఈసారి ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠగానే ఉన్నది. నవంబర్ 30న సాయంత్రం తర్వాత విడుదలైన ఎగ్జిట్ ఫలితాల్లో కాంగ్రెస్ ఆధిక్యం కనబర్చడంతో పార్టీ శ్రేణులు జోష్‌లో ఉన్నారు. దానికి తోడు కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు చేసుకోవచ్చంటూ టీపీసీసీ అధినేత రేవంత్‌రెడ్డి ప్రకటించడం పార్టీ శ్రేణులకు మరింత ఉత్సాహనిస్తున్నది. ఇదిలా ఉండగా బీఆర్ఎస్ యువనేత, తాజా మాజీ మంత్రి కేటీఆర్ ఎగ్జిట్ పోల్స్ సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదంటూ మీడియాకు వెల్లడిస్తూ పార్టీ శ్రేణుల్లో భరోసా నింపారు. అధికారం చేపట్టబోయేది మనమే అంటూ తెలుపడంతో ఫలితాలపై మరింత ఉత్కంఠ నెలకొన్నది. ఎవరి ధీమాలో వాళ్లు ఉన్నారు. మా పార్టీ గెలుస్తుందంటే మా పార్టీ గెలుస్తుందంటూ పలు చోట్ల బెట్టింగ్ కూడా కొనసాగుతున్నట్లు తెలిసింది.

ఎన్నికల ఫలితాలకు ఒక్క రోజే ఉండడంతో అందరి దృష్టి రిజల్ట్ మీదే ఉన్నది. వివిధ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులతో ఉమ్మడి జిల్లాలో 173 మంది బరిలో ఉండగా రేపటితో వారి భవితవ్యం తేలనున్నది.

# హంగ్ ఛాన్సే లేదు...హ్యాట్రిక్ సీఎం కెసిఆర్..!

**సురభి నాటకాలను మించి కాంగ్రెస్ నాయకులు నటన**
**2018లోనూ తప్పుడు సర్వేలతో అయోమయం**
**71కిపైగా స్థానాలతో సింగిల్ లార్జెస్టు పార్టీ మాది**
**మహబూబ్‌నగర్‌లో అత్యధిక మెజార్టీతో నేను గెలుస్తా**
**మీడియా సమావేశంలో మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్**


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ బ్యూరో,డిసెంబరు 01 ప్రభాతవార్త :** మూడవ తేదీనాడు వెలువడే ఫలితాల్లో అధికార బిఆర్ఎస్ పార్టీ ఘనవిజయం సాధించి సింగిల్ లార్జెస్ట్ పార్టీగా తిరిగి అధికారంలోకి వస్తుందని కెసిఆర్ మూడవసారి ముచ్చటగా ముఖ్యమంత్రి అవుతారని మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ నాయకులు తప్పుడు సర్వేలతో ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని సురభి నాటకాలకు మించి వారు నటి స్తు న్నారని విమర్శించారు. శుక్రవారం న్యూటౌన్‌లో ఉన్న బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మంత్రి ప్రసంగించారు. 2018లోనూ తమకు కేలం 48 సీట్లు మాత్రమే వస్తాయని ఎగ్జిట్ పోల్‌లో అంచనా వేశారని అయితే అందుకు విరుద్ధంగా 88 స్థానాలు కైవసం చేసుకుని సత్తా చాటినట్లు గుర్తు చేశారు. మూడవ తేదీ ఫలితాల్లోనూ ఇది రిపీట్ అవుతుందని తమకు 71 నుండి 81 వరకు స్థానాలు వస్తాయని మంత్రి తెలిపారు. కొందరు మేధావులు, ఒక టీవీ ఛానల్ ఈ మేరకు సర్వే నిర్వహించిందని ఆయన అన్నారు. తాము చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తమకు మరోసారి పట్టం కట్టేలా చేస్తున్నాయన్నారు. బిజెపి మత రాజకీయాలు, కాంగ్రెస్ కుల రాజకీయాలు చేస్తోందని తమ పార్టీకి సీఎం కెసిఆర్ కుల,మత రాజకీయాలు అవసరం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసిన ఎమ్మెల్యే అభ్యర్థులను హైదరాబాద్‌లో ఉంచే ధైర్యంలేక వారిపై అపనమ్మకంతో బెంగుళూరుకు తరలిస్తున్నారని మంత్రి ఎద్దేవా చేశారు. గతంలో కాంగ్రెస్ పార్టీకి ఢిల్లీ అధిష్టానంగా ఉంటే ఇప్పుడు పక్కనే బెంగుళూరు రూపంలో మరో అధిష్టానం జత అయిందని కర్ణాటక డిప్యూటి సీఎం శివకుమార్ చేతిలో తెలంగాణ కాంగ్రెస్ కీలుబొమ్మగా మారిందన్నారు. తెలంగాణకు వచ్చిన ఆపిల్ సంస్థను బెంగుళూరుకు తరలించుకు పోయారని భవిష్యత్తులోనూ ఇలాంటి అనర్థాలు దాపురించవని గ్యారంటీ ఏమిలేదన్నారు. శ్రీకాంతాచారి తెలంగాణ కోసం ఆత్మబలిదానం చేసుకున్నప్పుడు రేవంత్‌రెడ్డి ఎక్కడున్నారని ఈ సందర్భంగా మంత్రి ప్రశ్నించారు. తెలంగాణ పోరాటంలో ఏ మాత్రం పాత్రలేని వ్యక్తులు కూడా ఆ అంశంపై మాట్లాడడం సిగ్గుచేటన్నారు. దొంగ హామీలు దొంగ సర్వేలతో ప్రజలను అయోమయానికి గురి చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ఫలితాలు వెలువడిన తర్వాత తలబొప్పి కడుతుందన్నారు. ఆరు నూరైనా తెలంగాణ హ్యాట్రిక్ సీఎంగా కెసిఆర్ ప్రమాణ స్వీకారం చేస్తారని మంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పి. చంద్రశేఖర్, జిల్లా గ్రంథాలయాల సంస్థ ఛైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, ముడా ఛైర్మన్ గంజి వెంకన్న, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు గోపాల్ యాదవ్, జిల్లా గొర్రె కాపరుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు శాంతయ్య యాదవ్, బిఆర్ఎస్ కెవి అధ్యక్షుడు కృష్ణమోహన్, మార్కెట్ కమిటి ఛైర్మన్ రెహమాన్, మాజీ మార్కెట్ కమిటి ఛైర్మన్ చెరుకుపల్లి రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# నిరంతర కట్టుదిట్టమైన మూడంచల భద్రత పర్యవేక్షణలో ఎన్నికల ఈవీఎంలు...

**నెల్లికొండ వ్యవసాయ మార్కెట్ యార్డ్ స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన ఎన్నికల ఈవీఎంలు:జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్**


కౌంటింగ్ ప్రక్రియకు ఏర్పాట్లు పరిశీలిస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 01 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ నియోజకవర్గాల్లో గురువారం నిర్వహించిన ఎన్నికలకు సంబంధించి 3 నియోజకవర్గాల్లో 802 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వహించిన ఎన్నికల అధికారులు, సిబ్బంది ఆయా కేంద్రాల నుంచి వారికి కేటాయించిన ప్రత్యేక వాహనాల్లో డిస్టిబ్యూషన్ కేంద్రాల రూట్ల వారిగా, కేంద్రాల వారీగా ఈవీఎంలను ఎన్నికల సామాగ్రిని తిరిగి అధికారులు స్వాధీనం చేసుకొని పూర్తి స్థాయి పరిశీలన పూర్తైన తర్వాత స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఈవీఎంలను శుక్రవారం ఉదయం నాగర్‌కర్నూల్, నెల్లికొండ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో మూడు నియోజకవర్గాల ఎన్నికల అబ్జర్వర్లు మిథిలేష్ మిశ్రా, సతీష్‌కుమార్‌లతో కలిసి జిల్లా కలెక్టర్ ఉదయ్‌కుమార్, వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో పోలైన – మిగతా3లో..

# నాయకుల్లో గుబులు రేపుతున్న..

# ఎగ్జిట్‌పోల్స్..!

**- గెలుపుపై ఎవరికివారే ధీమా..**
**- అధికారం తమదంటే తమదని మంతనాలు..**
**- ఉమ్మడి జిల్లాల్లో ఫిఫ్టీఫిఫ్టీగా మారనున్నాయని విశ్లేషణలు..**
**- అభ్యర్థుల భవితవ్యం బాక్సుల్లో భద్రం..**
**- రేపటి సాయంత్రంలోగా తేలనున్న అభ్యర్థుల జాతకం..**



**భూత్పూర్,డిసెంబర్ 1,ప్రభాతవార్త :** గడచిన నెలరోజుల నుంచి పార్టీలు, అభ్యర్థుల్లో నెలకొన్న ఉత్కంఠకు రేపు తెరపడనుంది. పాలమూరు ఉమ్మది ఐదు జిల్లాల నుంచి 14మంది ఎమ్మెల్యేలెవరన్న అంశం ఆదివారం పటాపంచలుకానున్నాయి. మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాల నుంచి 14మంది ఎమ్మెల్యేల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ఎన్నికల సమయం ముగియగానే నవంబర్ 30వ తేది సాయంత్రం ఐదున్నర గంటల నుంచి ఎక్జిట్ పోల్స్‌సర్వేల రిపోర్డులను ఆయా కంపెనీలు, సంస్థలు, మీడియా చానల్స్ వెలువరింకుకోవచ్చని ఈసీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆయా సర్వే సంస్థలు వాటి సర్వేల ఆధారంగా పార్టీల భవితవ్యాల్ని బాహాటంగా వెలువరించాయి. ఎక్జిట్ పోల్స్ కొన్ని పార్టీలకు అనుకూలంగాను, మరికొన్ని పార్టీలకు ప్రతికూలంగా రావడంతో ఆయా పార్టీలు, నాయకుల్లో సర్వేలు గుబలు రేపుతున్నాయని పలువురు రాజకీయ నాయకులతో పాటు పలు పార్టీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. కొట్లాడి తెలంగాణ తెచ్చి రెండు ధఫాలు అధికారం చేపట్టి అభివృద్ధి చేసి రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ వైపు తీసుకువెళ్తున్న ఈ దఫాకూడా తెలంగాణ ప్రజలు తమకే పట్టం కడతారని భావించిన బీఆర్ఎస్‌కు ఎక్జిట్ పోల్స్ కొన్ని చోట్ల అనుకూలంగాను, మరి కొన్ని చోట్ల ప్రతికూలంగా రావడంతో అధికార పార్టీ అభ్యర్థులు, పార్టీలకు కంటిమీద కునుకులేకుండా చేశాయని పలువరు విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ సారి కూడా తెలంగాణ ప్రజలు తమకే పట్టం కడతారని ముచ్చటగా మూడోసారి గెలిచి హాట్రిక్ సాధిస్తామనుకున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఎక్జిట్ పోల్స్ కొంత నిరాశను కల్గిస్తున్నాయని చెప్పకతప్పదు. ఇక ఉమ్మడి పాలమూరు జిల్లాల విషయానికొస్తే మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియాజకవర్గంలో రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి రెండోసారి మంత్రి పదవిని చేపట్టిన బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఒకమారు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజల్లో సాదాసీదాగా ఉండి ఉదాసీనతతో వ్యవహరిస్తు మంచి పేరు తెచ్చుకున్న యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ జాతీయ నేతగా పార్టీకి విశిష్ట సేవలందించిన మాజీ ఎంపి ఎపి జితేందర్‌రెడ్డి తనయుడు ఎపి ముథున్‌రెడ్డి ఎన్నికల బరిలో ఉన్నారు. వీరిలో గెలుపెవరిదన్నది చెప్పడం కష్టమని పలువరు భావిస్తున్నారు. మిథున్‌రెడ్డి రాజకీయంలో కొత్తమొఖం కాబట్టి ఇక్కడి స్థానం నుంచి ప్రధానంగా ద్విముఖంగా పోటీ కనబడుతోందని, పోతే బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య గెలుపు ఫిఫ్టీఫిఫ్టీగా మారనుందని ఓటర్లు ఎవరివైపు మొగ్గుచూపారన్నదీ ఆదివారంతో తేలనుంది. ఇక దేవరకద్ర అసెంబ్లీ విషయానికొస్తే బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి నియోజకవర్గంలో చేపట్టిన సంక్షేమ పథకాలు, చెక్‌డ్యాంలు, పెన్షన్లు, రైతు బంధు, రైతు బీమా, దళితబంధు, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి ప్రభుత్వ పథకాలు ఎక్కువగా మంజూరు చేయించి నియోజకవర్గ ప్రజల్లో మంచిపేరు తెచ్చుకున్న దేవరకద్ర నియోజకవర్గ ప్రజలు తనకే పట్టం కడతారని, తన గెలుపు ఖాయమని ఆల ధీమాతో ఉన్నారు. ముచ్చటగా మూడోసారి గెలిచి హాట్రిక్ సాధించి రాష్టంలో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే సీఎం కేసీఆర్ నేతృత్వంలో మంత్రి పదవీ కొట్టాలనే తపనతో ఆల ఉన్నట్లు తెలుస్తోంది. ఆల ఆశయం ఎంతవరకు ఫలిస్తుందో ఆదివారం వరకు వేచి చూడాల్సిందే. ఇక ఇదే నియోజకవర్గం నుంచి ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ నుంచి తొలిసారి ఎమ్మెల్యే పదవీకి పోటీ చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు జి మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) కూడా ఎమ్మెల్యేగా గెలిచి బోణి కొట్టాలనే తపనతో ఉన్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలో అధికార పార్టీ బీఆర్ఎస్ అభ్యర్థి ఆలకు ధీటుగా జీఎంఆర్ కృషిచేస్తున్నారని ఇక్కడి విశ్లేషకుల అభిప్రాయం. ఇద్దరిలో గెలుపెవరన్నదీ చెప్పడం కష్టమని పలువురు పేర్కొంటున్నారు. చిట్టచివరకు అంతిమంగా స్వల్పపాటి మెజార్టీతో అధికార పార్టీ అభ్యర్థి ఆల వెంకటేశ్వర్‌రెడ్డి నెగ్గుకు రాగల్గుతాడని పలువురు విశ్లేషకులు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మూడో స్థానంలో బీజేపీ అభ్యర్థి కొండా ప్రశాంత్‌రెడ్డి వెనకంజలో ఉన్నట్లు తెలుస్తోంది. జడ్చర్ల అసెంబ్లీ విషయానికొస్తే ఎమ్మెల్యేగా, మంత్రిగా అపారఅనుభవమున్న డాక్టర్ అవంచ లక్ష్మారెడ్డికే జడ్చర్ల ప్రజలు పట్టం కట్టే అవకాశాలు మెండుగా ఉన్నాయని విశ్లేషకుల అభిప్రాయం. కాంగ్రెస్ నుంచి యువకుడైన అనురుధ్‌రెడ్డి కూడా లక్ష్మారెడ్డికి గట్టి పోటీ ఇస్తున్నారు. ప్రజలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేస్తే అనురుధ్‌రెడ్డి గెలుస్తాడనే అభిప్రాయం లేకపోలేదు. ఇక బీజేపీ నుంచి అభ్యర్థిగా పోటీలో ఉన్న సీనియర్ నాయకుడు, కల్వకుర్తిలో తెలుగుదేశం అధినేత మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ ఎన్‌టీఆర్నే ఓడించిన ఘనుడు చిత్తరంజన్‌దాస్‌కు నియోజకవర్గంలో చెప్పుకోదగ్గ నసీబ్ లేదని పలువురు పేర్కొంటున్నారు. చిత్తరంజన్‌దాస్‌కు జడ్చర్ల సరైన కేడర్ లేకపోయినప్పటికి మొక్కవోని ధైర్యంతో తన వంతు కర్తవ్యంగా బీజేపీ నుంచి పోరు సాగిస్తున్నారు. అయితే ఇక్కడ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ లక్ష్మారెడ్డికి, కాంగ్రెస్ నుంచి యువనాయకుడు అనురుధ్‌రెడ్డి మధ్యే ప్రధానంగా పోటీ నెలకొంది. వీరిద్దరిలో లక్ష్మారెడ్డి గెలుపు సునాయాసమేనని పలువురు భావిస్తున్నారు. అయితే ఫలితం ప్రజాతీర్పు ఏ విధంగా ఉండనుందోనన్న అభిప్రాయం కూడా లేకపోలేదు. వనపర్తిలో బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి నిరంజన్‌రెడ్డి, గద్వాలలో కాంగ్రెస్ అభ్యర్థి సరిత, అలంపూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి సంపత్‌కుమార్, కొల్లాపూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి జూపల్లి కృష్ణారావు, అచ్చంపేటలో కాంగ్రెస్ అభ్యర్థి చిక్కుడు వంశీకృష్ణ, నాగర్‌కర్నూల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి జనార్ధన్‌రెడ్డి, కల్వకుర్తిలో బీఆర్ఎస్ అభ్యర్థి జైపాల్ యాదవ్, షాద్‌నగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి చౌల ప్రతాప్‌రెడ్డి, మక్తల్‌లో కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరి, నారాయణపేటలో బీఆర్ఎస్ అభ్యర్థి ఎస్ రాజేందర్‌రెడ్డి, కొడంగల్‌లో కాంగ్రెస్ అభ్యర్థి, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి గెలుపు సునాయాసమని పలువురు రాజకీయ విశ్లేషకులు జోష్యం చెబుతున్నారు. ఎవరెన్ని చెప్పినా, ఎన్ని ఎక్జిట్ పోల్స్ వెలువరించి ఘంటా పథంగా చెప్పినా ఓటరు తీర్పును శిరసా వహించక తప్పదు, అంతుచిక్కని ఓటరు నాడిని ఎవరూ పసిగట్టలేరు. ఏదేమైనా గెలుపుపై ఎంతో ఆశలు పెట్టుకున్న అభ్యర్థుల ఆశలు అడియాసలు చేసేవి కొన్నయితే, గెలిపింపజేసి అందలమెక్కించేవి కొన్ని అని చెప్పవచ్చు. అందిరి ఊహాగానాలు పటా పంచెలు చేసే రేపటి కోసం ఆదివారం కోసం అందరూ వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

## ఘనంగా వాసవీమాత పల్లకిసేవ



**దేవరకద్ర,డిసెంబరు1 ప్రభాతవార్త:** దేవరకద్రలోని శ్రీ వాసవి కన్య కాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి శుక్రవారం అమ్మ వారి పల్లకిసేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా ఈ పూజలు నిర్వహించారు. అలాగే అమ్మవారికి అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పల్లకిలో తీసుకొని దేవస్థానం చుట్టూ ప్రదిక్షణలు నిర్వహించారు. పురోహితుల వేదమంత్రాలు, భక్తులు హరినామశ్చరణల మద్య ఈ సేవ ముందుకు కదిలింది. అనంతరం అమ్మవారికిప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవిమాత అమ్మవారు భక్తులకు అలం కరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక ఆర్యవైశ్యసంఘం అధ్వర్యంలో భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.

**ఘనంగా కుంకుమార్చన:** దేవస్థానంలో శ్రీచక్రాలతో అమ్మవారికి కుంకుమార్చన పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అలితా సహస్రనామ పారాయణం కార్యక్రమాన్ని కూడనిర్వహించారు. పంచామతాలతో అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజ నిర్వహించారు. మహా మంగళహారతి, ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీఅధ్యక్షుడు కల్వకన్నయ్యశెట్టి, మహిళాసంఘం అధ్యక్షురాలు గుద్దేటి మంజులరాణీ, జిల్లా విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు గుద్దేటి చంద్రయ్యలతో పాటు స్థానిక ఆర్యవైశ్యులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## దేవరకద్ర నియోజకవర్గంలో 82.33 శాతం పోలింగ్



ఓటు వేసిన సిరా చుక్కను చూయిస్తున్న మన్యంకొండ దేవస్థానం చైర్మన్ కుటుంబసభ్యులు

**దేవరకద్ర,డిసెంబరు1 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లాలోని దేవరకద్ర నియోజకవర్గంలో గురువారం జరిగిన అసెంబ్లి ఎన్నికల్లో 82.33 శాతం పోలింగ్ జరిగింది. గత 2018 అసెంబ్లి ఎన్నికల్లో 85.11 శాతం పోలింగ్ జరిగింది. అలాగే జడ్చర్ల నియోజకవర్గంలో 81.18 శాతం, గత ఎన్నికల్లో 82.32 శాతం, మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో 70.41 శాతం, గత ఎని న్నకల్లో 74.93 శాతం చొప్పు పోలింగ్ జరిగింది. అయితే దేవరకద్ర మండలంలో 83.91 శాతం పోలింగ్ జరిగిందని అధికారులు తెలిపారు.

## అయ్యప్ప మాల ధారణ



అయ్యప్పమాల ధరించిన అయ్యప్ప స్వాములు

**దేవరకద్ర,డిసెంబరు1 ప్రభాతవార్త:** దేవరకద్ర, చిన్నచింతకుంట మండలాలకు చెందిన అయ్యప్పభక్తులు శుక్రవారం మహబూబ్‌నగర్‌లో అయ్యప్ప మాలను ధరించారు. ప్రతి ఏడాది అయ్యప్ప భక్తులు డిసెంబరు నెలలో అయ్యప్ప మాలలను ధరిస్తారు. 41 రోజుల పాటు తిష్ఠగా పూజలు చేస్తారు. అలాగే ఈ ఏడాది కూడ అయ్యప్ప భక్తులు అయ్యప్ప మాలను ధరించారు. మహబూబ్‌నగర్‌లోని అయ్యప్ప కొండపై శర్మ గురుస్వామి అధ్వర్యంలో లాల్‌కోటకు చెందిన 18వ పడి కెంగూరి అంజన్నయాదవ్ గురుస్వామితో పాటు దాదాపు 15 మంది అయ్యప్ప భక్తులు అయ్యప్ప మాలను ధరించారు. ఈ సందర్భంగా గుడిలో అయ్యప్పస్వాములు ప్రత్యేక పూజలు నిర్వమించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్పస్వాములతో పాటు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్



**భూత్పూర్, డిసెంబర్1, ప్రభాతవార్త:** భూత్పూర్ మున్సిపాలిటీ నాల్గొ వార్డు ఇందిరానగర్‌లో గొల్ల బత్తుల సత్తయ్య నిర్మించుకున్న నూతన గృహప్రవేశ కార్యక్రమంలో భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ హాజరై ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, మూడో వార్డు కౌన్సిలర్ తూము శ్రీనివాస రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ గడ్డం రాములు, పార్టీ పట్టణ అధ్యక్షుడు సత్తూర్ సురేష్‌గౌడ్‌తో పాటు నాయకులు గడ్డం యాదయ్య, బజార్ పరుశురాం, వి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల కౌంటింగ్ పరిశీలకురాలకు ఘనంగా స్వాగతం



**గద్వాల ప్రతినిధి డిసెంబర్1 ప్రభాతవార్త:** సాధారణ ఎన్నికల సందర్భం గా అలంపూర్ నియోజకవర్గానికి కేటాయించబడిన ఎన్నికల కౌంటింగ్ పరిశీలకులు జి. అనురాధ, శుక్రవారం ఐడిఓసి కార్యాలయానికి చేరుకోగా వారిని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతిఅదనపు కలెక్టర్ రెవెన్యూ చీర్ల శ్రీనివాసులు పూల మొక్క అందజేసి ఘనంగా స్వాగతం పలికారు.

## డిసెంబర్ 2వ వారంలో జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు : డీఈఓ



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 01 ప్రభాతవార్త:** విద్యార్థుల్లో సృజ నాత్మక శక్తి వెలికి తీసి వారిలోని ఆలోచన శక్తిని, సైన్స్ పరిజ్ఞాన పరిశీలన నైపుణ్యాన్ని మరియు ప్రయోగ నైపుణ్యాలను పెంపొందిస్తూ భావి శాస్త్రవేత్తలను తయారు చేయడానికి అవకాశం కలిగించే జిల్లా స్థాయివిద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శన డిసెంబర్ 2వ వారంలో నిర్వ హిస్తున్నట్లు నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు శుక్రవారం తెలిపారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. ఇట్టి అవకాశాన్ని జిల్లా విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఎయిడ్స్ డే సందర్భంగా ర్యాలీ

**వీపనగండ్ల, డిసెంబర్ 1, ప్రభాతవార్త :** వీపనగండ్ల మండల కేంద్రంలో ఎయిడ్స్ డే సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో ఎయిడ్స్ డే సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ..ఎయిడ్స్ గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఎయిడ్స్ రోగులను ఆదరించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజశేఖర్, ఆసుపత్రి సిబ్బంది, ఏ.ఎన్.ఎం.లు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన ఎన్నికల జాతర

- జయాపజయాలపై సర్వత్రా ఉత్కంఠ
- చల్లా బలపరిచిన విజేయుడు విజయం సాధిస్తాడా
- సంపత్‌కుమార్ విజయ ఢంకా మోగిస్తుండా
- భయపెడుతున్న ఏనుగు
- కమలం చీలిక ఎవరికి లాభమో
- అలంపూర్ ఎన్నికలపై మొదలైన లబ్‌డబ్

**అలంపూర్/ ఉండవెల్లి, డిసెంబరు 1 ప్రభాతవార్త:** హోరాహోరీ పోరులో నెలరోజుల పాటు ప్రచారాల జాతర ముగిసింది. ఎన్నికల కమిషన్ కన్ను గప్పి ఆయా పార్టీలు చాలాచోట్ల నిబంధనలకు పాతరపెట్టడం కనిపించింది. ఏదేమైనా మొత్తానికి ఎన్నికల ప్రక్రియ ముగిసింది ఫలితాల వెల్లడి ముందుంది. తమ పోరాటానికి ఫలితం దక్కుతుందా అన్న మీమాంసలో అభ్యర్థులు, పార్టీ అభిమానులు గుండెలు ప్రస్తుతం లబ్‌డబ్ అంటూ కొట్టుకుంటున్నాయి. మరో రెండు రోజుల సమయం ఉండడంతో నాయకులు అంచనాల్లో పడ్డారు. అలంపూర్ అసెంబ్లీలో ఎన్నికలు జరిగిన తీరుతెన్ను ఓసారి పరిశీలిస్తే..

**ఊహించని మలుపులు:** ఎన్నికలు సమీపిస్తున్న తరుణం నుంచి ఎన్నికల కోడ్ వచ్చేదాకా నియోజకవర్గంలో ఊహించని మలుపులు చోటు చేసుకున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే అబ్రహాంకు టికెట్ అందరికంటే ముందు నిర్ణయం కావడం ఆ టికెట్ చల్లా బలపరిచిన అభ్యర్థికి రావడం జరిగింది. ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీకి చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యే అబ్రహాం, మంద జగన్నాథం, మంద శ్రీనాథ్ తదితర అగ్రశ్రేణి నాయకులూ కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. బహుజన సమాజ్ పార్టీ ద్వారా ఏనుగు గుర్తుతో రంగంలోకి ప్రసన్నకుమార్ దిగారు. ఎన్నికల కోడ్ తర్వాత జోరుగా హుషారుగా తమ ప్రచారాలు కొనసాగించారు. బిఆర్ఎస్ అభ్యర్థి విజయుడు తరపున సీఎం కెసిఆర్ ప్రచారానికి రావడం సంపత్‌కుమార్ తరపున రేవంత్‌రెడ్డి, విజయశాంతి, మల్లికార్జున ఖర్గే రావడం జరిగింది. ప్రధాన పార్టీల మధ్య తీవ్ర పోటీ నెలకొంది.

**ఫలితం ఎవరివైపు:** అలంపూర్ నియోజకవర్గంలో ఎన్నికల ఫలితాలు ఎవరివైపు ఉంటాయి అనేదానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఎగ్జిట్ పోల్ అంచనాల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ విజయం సాధిస్తుందని స్పష్టమవుతుంది. ఇది కాంగ్రెస్ వర్గాలకు ఉత్సాహాన్ని ఇస్తున్న అంశం. అయితే ఈ పోల్ అంచనాలను బిఆర్ఎస్ నాయకులు తిప్పికొడుతున్నారు. అలంపూర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన బిఆర్ఎస్‌కే విజయం ఖాయమని అంటున్నారు. మండలాల వారిగా గ్రామాల వారిగా ఎవరికి వారు తమకు నచ్చిన ఓట్లను అంచనా వేసుకుంటున్నారు. కొన్నిచోట్ల స్థానిక నాయకుల కారణంగా కూడా ప్రధాన పార్టీల ఓట్లలో తేడాలు వచ్చినట్లు స్పష్టం అవుతుంది. గ్రామ సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, మున్సిపాలిటీల్లో చైర్మన్లు, కౌన్సిలర్ల కారణంగా కొన్నిచోట్ల ఓట్లు ప్లస్‌కాగా, వారిమీద ఉన్న వ్యతిరేకత కూడా పార్టీ మీద పట్టణంలో ప్రభావంచూపింది. ఈ క్రమంలో ఎవరు గెలుస్తారు, ఎవరు నిలుస్తారు? అన్నది ఉత్కంఠ భరితంగా మారుతుంది. మూడవ తేదీ సాయంత్రం ఫలితాలు సమయానికి కాని దీనిపై స్పష్టత రాదు. అందుకే అందరి చూపు ప్రస్తుతం ఫలితాలపైనే ఉంది.

**ఏనుగు పంజా పడేది ఎవరిపై:** చాపకింద నీరులా గ్రామ గ్రామాలకు దూసుకువెళ్లిన ఏనుగు ఎవరిపై కాలు విసురుతుందో అర్థంకాక ప్రధాన పార్టీల నాయకులు అయోమయంలో పడ్డారు. ఏనుగు గుర్తుతో పోటీలోకి దిగిన ప్రసన్నకుమార్ నియోజకవర్గ నలుమూలల నుంచి ఓటింగ్‌ను సాధించుకున్నారు. ఇది ఆయనను విజయం వైపు తీసుకువెళుతుందా, లేక? ప్రధాన పార్టీల జయాపజయాలను శాసిస్తుందా? అన్నది ఉత్కంఠగా మారింది. ఒకవేళ ఓట్లను చీలిస్తే ఆ ప్రభావం బిఆర్ఎస్‌పైన ఉంటుందా? లేక కాంగ్రెస్‌పైన ఉంటుందా? అన్నది అనుమానంగా మారింది. ఇక కమలం తరపున పోటీ చేస్తున్న రాజగోపాల్‌కి ఆయా ప్రాంతాలలో మంచి ఓటింగ్ వచ్చింది. ఈయన ప్రభావం కూడా రెండు పార్టీలపై ఉంటుందనేది స్పష్టం. నలుగురు రంగంలోకి దిగడం వల్ల చీలిక ఏర్పడి అది ప్రధాన పార్టీల్లో ఒకరికి ప్లస్‌గా, మరొకరికి మైనస్‌గా మారబోతుంది అది ఎవరికి? అన్నది ఫలితాలు వచ్చిన తర్వాతే తెలుస్తుంది. మొత్తానికి ఇది పార్టీ అభ్యర్థులకే కాదు, నేతలకు, కార్యకర్తలకు, ఆయా పార్టీల అభిమానులకు, తమ ఓటు హక్కును వినియోగించుకున్న ప్రజలకు కూడా ఉత్కంఠ భరితమైన సమయం.

# అల్లుని చేతిలో మామ హతం?

- మర్రిపల్లిలో ఘటన



మృతి చెందిన సోనమోని వెంకటయ్య



సోనమోని వెంకటయ్య (ఫైల్)

**ఉప్పునుంతల, డిసెంబరు 01 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల పరిధిలోని మర్రిపల్లి గ్రామానికి చెందిన సోనమోని వెంకటయ్య (50)ను అల్లుడు ఉప్పునుంతల గ్రామానికి చెందిన గడ్డం సాయిబాబు అనే వ్యక్తి రాళ్లతో దాడిచేసి హతమార్చాడు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సోనమోని వెంకటయ్య కూతురు మాధవిని రెండు సంవత్సరాల క్రితం ఉప్పునుంతలకు చెందిన సాయిబాబుకు ఇచ్చి వివాహం చేశాడు. వివాహ సమయంలో 13 తులాల బంగారం, 3 లక్షల 50 వేల రూపాయలు ఇచ్చి వివాహం చేసినట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై తెలిపారు. వివాహం జరిగిన ఆరు నెలల వరకు సవ్యంగా ఉన్నారని, ఆ తర్వాత అల్లుడు సాయిబాబు తరచుగా తప్పతాగి కూతురును వేధించి కొట్టేవాడని, తీవ్రంగా కొట్టడంతో ఇటీవల తలకు గాయం కావడంతో పుట్టింటే వద్దే ఉంటుందని, అందరి సమక్షంలో మాట్లాడి తిరిగి సాయిబాబా వెంట కూతురును పంపించినట్లు వారు తెలిపారు. కొన్ని రోజుల తర్వాత తిరిగి డబ్బులు తీసుకురావాలని కొట్టి పుట్టింటికి పంపించాడు. గురువారం సాయంత్రం నిందితుడు తప్ప తాగి మర్రిపల్లి గ్రామానికి వచ్చి మృతుని ఇంటి వద్ద గొడవకుదిగి మామను చంపుతానని హెచ్చరిస్తూ మృతుడు సోనమోని వెంకటయ్య కోసం గ్రామంలో వెతికాడు. వ్యవసాయ పొలం వద్దనే ఉంటాడని భావించి పొలం వద్దకు వెళ్లి రాళ్లతో దాడిచేసి కొట్టి చంపినట్లు మృతుని భార్య సోనమోని అలివేల తెలిపినట్లు ఎస్సై గురుస్వామి తెలిపారు. సాయంత్రం ఏడుగంటల సమయంలో అదే గ్రామానికి రెడ్డమోని జగదీష్ మృతుని కుటుంబ సభ్యులకు వెంకటయ్య మృతి చెందినట్లు సమాచారం అందించడంతో వెంటనే కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సంఘటన వద్దకు చేరుకున్నారు. శుక్రవారం ఉదయం తన భర్తను తన అల్లుడు ఉప్పునుంతలకు చెందిన గడ్డం సాయిబాబు కొట్టి చంపినట్లు మృతుని భార్య అలివేల ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై గురుస్వామి ఆధ్వర్యంలో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. సంఘటనా స్థలం వద్ద పంచనామా నిర్వహించిన తదుపరి పోస్టుమార్టం నిమిత్తం అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య సోనమోని అలివేల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గురుస్వామి తెలిపారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించిన డిసిసి అధ్యక్షులు డా. వంశీకృష్ణ మర్రిపల్లి గ్రామానికి చెందిన సోనమోని వెంకటయ్య హత్యకు గురికావడంతో విషయం తెలుసుకున్న నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డా. చిక్కుడు వంశీకృష్ణ అచ్చంపేట పట్టణంలో ఏరియా ఆసుపత్రిలో మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. సంఘటన జరిగిన విషయంపై కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ విషయంపై పోలీసులు కఠినమైన చర్యలు తీసుకొని మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన సూచించారు. పరామర్శించిన వారిలో డిసిసి అధ్యక్షులు డా. వంశీకృష్ణతో పాటు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్టఅనంతరెడ్డి, రామచంద్రయ్య, లింగమయ్య, మనోహర్‌రావు (బాబురావు) తదితరులు ఉన్నారు.



అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రి వద్ద సంఘటనపై కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుంటున్న డిసిసి అధ్యక్షులు డా. వంశీకృష్ణ

# చిన్నారుల తల్లిదండ్రులకు బాలామృతం అందజేత

**బాలామృతం చిన్నారులకు బలమైన ఆహారం : గ్రామ పంచాయతీ కార్యదర్శి నరేష్ గౌడ్**

**వీపనగండ్ల, డిసెంబర్ 1, ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల కేంద్రంలో అంగన్వాడి కేంద్రాలలో ఏడు నెలల నుండి మూడు సంవత్సరాల పిల్లలకు బాలామృతం అందజేశారు. ఈ సందర్భంగా సంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ..చిన్నారులకు బాలామృతం బలమైన ఆహారంగా పనిచేస్తుందని మూడు సంవత్సరాల లోపు పిల్లలను కలిగిన ప్రతి తల్లి అంగన్‌వాడి కేంద్రాల నుండి పోషక విలువలు కలిగిన బాలామృతాన్ని తీసుకొని చిన్నారులకు తినిపించాలని తల్లిదండ్రులకు సలహా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఉపాధ్యాయురాలు, ఆయాలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.



చిన్నారుల తల్లిదండ్రులకు బాలామృతం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శి నరేష్‌గౌడ్

# లక్ష్మారెడ్డి సారు గెలవాలి

**- జడ్చర్ల నుంచి ఫతేపూర్‌కు బీఆర్ఎస్ నాయకుల పాదయాత్ర**

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్1, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారం చేపట్టాలని, జడ్చర్లలో తిరిగి ఎమ్మెల్యేగా లక్ష్మారెడ్డి గెలవాలని కోరుతూ పాదయాత్ర చేపట్టారు. జడ్చర్ల మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఈట శ్రీనివాస్, దాస్‌రాంనాయక్ ఇద్దరు కలిసి జడ్చర్ల బంగారు మైసమ్మ అమ్మవారి ఆలయం నుంచి నవాబుపేట మండలం ఫతేపూర్ మైసమ్మ ఆలయం వరకు పాదయాత్ర చేపట్టారు. లక్ష్మారెడ్డి హ్యాట్రిక్ సాధించాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. గతంలో కూడా 2018లోనూ ఇలాగే పాదయాత్ర చేపట్టి అమ్మవారిని వేడుకుకోవడంతో సారు అఖండ మెజార్టీ సాధించారి, ఈసారి కూడా భారీ మెజార్టీ సాధించాలని వేడుకున్నట్లు తెలిపారు.



పాదయాత్ర చేపట్టిన ఈట శ్రీనివాస్, దాస్‌రాంనాయక్

# రామన్నపల్లి అత్యధికం

**- 94.77 శాతం పోలింగ్ నమోదు**

**- రాజేంద్రనగర్ పోలింగ్ స్టేషన్‌లో అత్యల్పం 43శాతం**

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్ 1, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో అత్యధికంగా 94.77శాతంతో రామన్నపల్లి పోలింగ్ స్టేషన్‌లో పోలింగ్ నమోదు అయింది. పోలింగ్ స్టేషన్ పరిధిలో మొత్తం 707ఓట్లు ఉండగా 670ఓట్లు పోలయ్యాయి. ఇందులో 340 పురుషులు, 330మందది మహిళలు తమఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా 90శాతం పైగా పోలింగ్ శాతం నమోదు అయిన పోలింగ్ సెంటర్ల వివరాలు ఇలా ఉన్నాయి..యారోనిపల్లిలో 92.24శాతం, హన్వాడలోని పోలింగ్ స్టేషన్19లో 90.32 శాతం, పోలింగ్ స్టేషన్ 22లో 91.82శాతం, సల్లోనిపల్లిలో 90.71శాతం, నాగినోనిపల్లిలో 92.27శాతం, టంకరలోని 3పోలింగ్ స్టేషన్లలో 91శాతం పైగా, ఓబ్లాయిపల్లిలో 92.27శాతం, తెలుగుగూడెంలో 93.28శాతం, చౌదర్‌పల్లిలో90.37శాతం, సుమారు పదిపోలింగ్ స్టేషన్లలో 90శాతం పైగా పోలింగ్ నమోదు కావడం గమనార్హం. రాజేంద్రనగర్ పోలింగ్ స్టేషన్‌లో 43శాతం పోలింగ్ నమోదు కాగా, భగీరథ కాలనీపోలింగ్ స్టేషన్‌లో44శాతం నమోదు అయింది. ఇదిలా ఉండగా మహబూబ్‌నగర్ నియోజకవర్గం మొత్తం 70.41 శాతం నమోదైంది.






డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులకు అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి రజని

## ఎయిడ్స్ మహమ్మారిని నిర్మూలిద్దాం!

**వనపర్తి ప్రతినిధి, డిసెంబర్1, ప్రభాతవార్త:** ఎయిడ్స్ చాపకింద నీరులా ప్రభలుతున్నందున...దానిని కూకటి వెళ్లతో తొలగించాల్సిన అవశ్యకత ప్రతి ఒక్కరిపై ఉందని సీనియర్ సివిల్ జడ్జి.రజిని అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వనపర్తి మండలంచిట్యాల గ్రామ శివారులో డ్రైవర్ అసోసియేషన్ డ్రైవర్స్‌కు అకాగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, లక్షణాలు ఉన్నవారు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకొని నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఎయిడ్స్ వ్యాదికి అడ్డుకట్ట వేసేందుకు అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఉత్తరయ్య, డేగల కృష్ణయ్య, అసోసియేషన్ అధ్యక్షులు. భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



**భూత్పూర్, డిసెంబర్1, ప్రభాతవార్త:** భూత్పూర్ మున్సిపల్ పరిధిలోని రెండో వార్డు శేరుపల్లి(బి)కి చెందిన పాలమూరు భీమయ్య(80) శుక్రవారం తెల్ల వారుజామున అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెల్సుకున్న మున్సి పల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ శేరుపల్లికి చేరుకుని భీమయ్యకు శ్రద్ధాంజలి ఘటించి తన వంతు సహాయంగా ఐదు వేలు మృతుని కుటుంబానికి అందించిన తన సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులుమాజీ ఎంపిపి చంద్రమౌళి, టి మురళిధర్‌గౌడ్, సత్తూర్ సురేష్‌గౌడ్, వార్డు కౌన్సిలర్ డెగావత్ గోపాల్ నాయక్, మాజీ ఉపసర్పంచి బాలస్వామి, నర్సింహులు, బాలరాజు, చీపుర్ల తిరుపతయ్య పాల్గొన్నారు.

## తెరుచుకున్న కొత్త మద్యం దుకాణాలు






తెరిచిన కొత్త మద్యం దుకాణాలు, బార్ ముందు బారులు తీరిన మందు బాబులు

**బాలానగర్, డిసెంబరు1 ప్రభాతవార్త:** నూతన లైసెన్సింగ్ ప్రక్రియ డిసెంబరు ఒకటవ తేదీ నుంచి అమల్లోకి వచ్చింది. దీంతో బాలానగర్ మండల కేంద్రంలోని వైన్ షాపులు ప్రారంభోత్సవ కార్యక్రమాలు చేశారు. అయితే ఎన్నికల ప్రక్రియ, ఓటింగ్ నేపథ్యంలో గత రెండు, మూడు రోజులుగా మద్యం దుకాణాలు మూతపడ్డాయి. శుక్రవారం మద్య ప్రియులు ఒక్కసారిగా వైన్స్‌కుబార్లు తీరారు. మదయం దుకాణాలు వాళ్ల పూజా కార్య క్రమాలు పూర్తి కాకముందే వైన్స్‌షాపు ముందు మందు బాబులు క్యూక ట్టారు. గత పాత లైసెన్స్ విధానంలో కొందరు వైన్స్ యజమానులు సిండికేట్‌గా మారి ఎమ్మార్పీ ధరల కంటే అధిక రేట్లకు మద్యాన్ని విక్రయించారని ఈ సారైనా విధించిన నియమ నిబంధనల ప్రకారం ఎమ్మార్పీ ధరలకే మద్యాన్ని విక్రయించాలని మద్యం ప్రియులు డిమాండ్ చేస్తున్నారు.

## దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



అమరచింతలో రాజవాలి దర్గాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు

**అమరచింత, డిసెంబర్1, ప్రభాతవార్త:** మక్తల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వాకిటి శ్రీహరి విజయం సాధించాలని శుక్రవారం అమరచింత మున్సిపల్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హాజరత్ రాజవాలి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి, అయూబ్ ఖాన్, మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించాలని, అలాగే మక్తల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వాకిటి శ్రీహరి విజయం సాధిస్తే నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చెస్తామని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు, తౌఫిక్, ఆసు, అక్బర్, పాష, నిస్సార్, మహమూద్, గౌస్, షబ్బీర్, ఖదీర్, ఫయాజ్, సద్దాం, మలాంగ్, వహీద్ పాల్గొన్నారు.

## మేఘారెడ్డికి మద్దతు నిలిచినా ప్రజలకు కృతజ్ఞతలు



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

**వనపర్తి ప్రతినిధి, డిసెంబర్1, ప్రభాతవార్త:** వనపర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తూడి మేఘారెడ్డికి నియోజకవర్గ ప్రజలు మద్దతుగా నిలవడం పట్ల టిడిపి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఏర్పాటు చేసిన సమావేశంలో టీడీపీ నాగర్ కర్నూల్ పార్ల మెంట్ తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు బి రాములు, మాజీ జెడ్పిటిసి ఏర్పుల వెంకటయ్య యాదవ్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ సర్వే సంస్థల ఆధారంగా 70 శాతం వరకు ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించారని, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఉన్నదని వారన్నారు. తెలుగుదేశం పార్టీ పుట్టింది హైదరాబాదు లోనని, బిఆర్ఎస్ నాయకులు ఆంధ్ర పార్టీ అని అనడం విడ్డూరంగా ఉందని అన్నారు. అసలు రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎక్కువ శాతం తెలుగుదేశం పార్టీ వారే ఉన్నారని అన్నారు. ప్రజా తీర్పు శిరసా వహించాల్సిందేనని, రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ క్యాడర్ ఉన్నదన్నారు. టిడిపి ఓటు బ్యాంకు ఉన్నందున మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలుగుదేశం పార్టీని పటిష్టం చేయడానికి సన్నద్ధమవుతున్నారని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు హోటల్ బల్‌రాం, కొత్త గొల్ల శంకర్, బాలరాజ్ తదితరులు ఉన్నారు.

## దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ ధరలు

**దేవరకద్ర, డిసెంబరు1 ప్రభాతవార్త:** దేవరకద్ర వ్యవసాయ మార్కెట్‌యార్డుకు శుక్రవారం రైతులు 1296 కింటాళ్ల ఆర్ఎస్ఆర్ ధాన్యాన్ని విక్రయానికి తీసుకవచ్చారు. కింటాల్ ఆర్ఎస్ఆర్ ధాన్యానికి అత్యధికంగా రూ.2979 ధర పలికింది. అలాగే అతితక్కువగా రూ.2721 ధర పలికింది. అలాగే 49 కింటాళ్ల హంస ధాన్యాన్ని రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. కింటాల్ హంస ధాన్యానికి అత్యధికంగా రూ.2000 ధర పలికింది. అలాగే అతి తక్కువగా 1937 ధరపలికింది. 7 కింటాళ్ళ ఆముదాలనురైతులు విక్రయానికి తీసుకవచ్చారు. కింటాల్ ఆముదాలకు అత్యధికంగా రూ.5429 ధర పలికింది. అతి తక్కువగా కూడ అంతే ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

### నిరంతర కట్టుదిట్టమైన మూడంచల

## భద్రత పర్యవేక్షణలో ఎన్నికల ఈవీఎంలు...

**మొదటి పేజీ తరువాయి భాగం..**

ఈవీఎంలు, ఎన్నికల సామాగ్రిని స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచారు. ఆయా నియోజకవర్గాల ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్లకు మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. నియోజకవర్గాల వారీగా వేర్వేరు గదుల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లు సీల్ చేసి సంతకాలు చేశారు. పటిష్ట భద్రత మధ్య నిరంతర బందోబస్తు పకడ్బందిగా ఉండనున్నట్లు కలెక్టర్ తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌ల చుట్టు ప్రక్కలకు ఏ ఒక్కరిని అనుమతించబోమని భద్రత సిబ్బందిని ఆదేశించారు.



కౌంటింగ్ గోదామ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

ఈ నెల 3వ తేదీన జరిగే ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు పకడ్బంది ఏర్పాట్లు చేయాలని రిటర్నింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు పక్కగా ఉండాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఎన్నికల సిబ్బంది వారి వారి ప్రాంతాలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సుల ద్వారా తరలివెళ్లారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు శుక్రవారం కలెక్టర్ సెలవు ప్రకటించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కొల్లాపూర్ రిటర్నింగ్ అధికారి కుమార్‌దీపక్, అదనపు కలెక్టర్ రెవెన్యూ కే.సీతారామారావు, నాగర్‌కర్నూల్ రిటర్నింగ్ అధికారి వెంకట్‌రెడ్డి, అచ్చంపేట రిటర్నింగ్ అధికారి గోపిరామ్, ఆయా పార్టీల ప్రజా ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

## మండలంలో 83.04 శాతం ఓటింగ్ నమోదు

**అత్యధికంగా వావిలాలలో 93.34శాతం**

**అత్యల్పంగా బీచుపల్లి పదవ బెటాలియన్‌లో 63.23 శాతం ఓటింగ్ నమోదు**

**ఇటిక్యాల,డిసెంబరు 01 ప్రభాతవార్త :** సాధారణ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా గురువారం జరిగిన అలంపూర్ శాసనసభ ఎన్నికల్లో భాగంగా మండలంలోని 49 పోలింగ్ బూత్‌లలో పోలైన 34 వేల 302 ఓట్లు పోలై 83.04 ఓటింగ్ శాతం నమోదైనట్లు తహసిల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలో మొత్తం ఓటర్లు 41 వేయి 370 ఓట్లకు గాను ఇందులో 20 వేల 613 మంది పురుషులు, 20వేల 576 మంది మహిళా ఓటర్లు ఉండగా 49 పోలింగ్ బూతులలో 17 వేల 323 మంది పురుషులు, 17 వేల 29 ఓట్లు మహిళలు ఎన్నికల్లో పాల్గొని ఓటు హక్కును నమోదు చేసుకున్నట్లు తహసిల్దార్ వెంకటేశ్వర్లు వివరించారు. కాక మండలంలో అత్యధికంగా వావిలాల గ్రామంలోని 49వ పోలింగ్ బూతులో 601ఓట్లకుగాను 561 ఓట్లు పోలై 93.34 శాతం నమోదైంది. ఎర్రవల్లి పదవ బెటాలియన్‌లోని 15వ పోలింగ్ బూత్‌లో 465 ఓట్లకు గాను 294 ఓట్లు పోలై 63.23 శాతం అతి తక్కువ ఓటింగ్ శాతం నమోదైంది. కాగా మండలంలోని మిగతా పోలింగ్ బూత్‌లలో 75 శాతం నుండి మొదలై 93.34 శాతం వరకు ఓటింగ్ నమోదైంది.



ఇటిక్యాల తహసిల్దార్ వెంకటేశ్వర్లు

## మండలంలో నేటినుండి కొత్త మద్యం షాపులు ప్రారంభం..

**ఇటిక్యాల,డిసెంబరు 01 ప్రభాతవార్త :** రాష్ట్ర వ్యాప్తంగా 2.620 మద్యం షాపులలో అమ్మకాల లైసెన్స్ నవంబరు 30తో ముగిసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు నెలలో కొత్తగా మద్యం షాపుల ఏర్పాటు కోసం టెండర్లను నిర్వహించగా టెండర్లలో పాల్గొని మద్యం షాపులు దక్కించుకున్న వారు శుక్రవారం మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తా పొగాకు కంపెనీ స్టేజీ దగ్గర కొత్తగా మద్యం షాపులను యజమానులు ప్రారంభించారు. కొత్తగా మద్యం షాపుల ఏర్పాటు కోసం ఆగస్టు నెలలో రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు నిర్వహించి కలెక్టర్, ఎక్సైజ్‌శాఖ అధికారుల ఆధ్వర్యంలో టెండర్లలో పాల్గొన్న యజమానుల సమక్షంలో లక్కి డ్రా పద్ధతిలో మద్యం షాపులను కేటాయించారు. ఆగస్టు నెలలో మద్యం షాపులు కేటాయించిన సాధారణ ఎన్నికలు ఉండడంతో డిసెంబర్ 1 నుండి మద్యం షాపులు ప్రారంభించుకోవాలని ఆగస్టు నెలలోనే ఆదేశాలు ఇచ్చారు. అధికారులు ఇచ్చిన ఆదేశాల మేరకు శుక్రవారం డిసెంబర్ 1న కొత్తగా మద్యం షాపులను యజమానులు ప్రారంభించుకున్నారు. మద్యం షాపులు పొందిన వారికి రెండేళ్లపాటు మద్యం అమ్మకాలకు అనుమతులు ఉన్నాయి.

## మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించిన డిసిసిబి డైరెక్టర్

**ఉప్పునుంతల,డిసెంబరు01 ప్రభాతవార్త :** మండలంలోని మర్రిపల్లి గ్రామానికి చెందిన సోనమోని వెంకటయ్య గురువారం సాయంత్రం అల్లుని చేతిలో హత్య గురికావడంతో శుక్రవారం సాయంత్రం మర్రిపల్లి గ్రామంలో మృతుని కుటుంబాన్ని డిసిసిబి డైరెక్టర్, ఉప్పునుంతల సింగిల్ విండో ఛైర్మన్ సత్తు భూపాల్‌రావు మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.



## ఈవిఎంల కౌంటింగ్ ప్రక్రియ పకడ్బందీగా, జాగ్రత్తగా నిర్వహించాలి..

**కౌంటింగ్ అబ్జర్వర్ దిలీప్‌సింగ్ కోహిల్**

**నారాయణపేట ప్రతినిధి,డిసెంబరు 01 ప్రభాతవార్త :** డిసెంబర్ 3 ఆదివారం నిర్వహించే అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్‌ను అత్యంత పకడ్బందీగా జాగ్రత్తగా ఈవిఎంల కౌంటింగ్ ప్రక్రియను నిర్వహించాలని కౌంటింగ్ అబ్జర్వర్ దిలీప్ సింగ్ కోహిల్ అన్నారు. శుక్రవారం నారాయణపేటలో డిసెంబర్ 3వ దత్తా బృందావన్ ఇన్స్టిట్యూట్‌లో 2 నియోజకవర్గాల కౌంటింగ్ నిర్వహణలో భాగంగా కౌంటింగ్ విధులు నిర్వహించే ఎస్‌ఓలు, కౌంటింగ్ సహాయ కౌంటింగ్ సూపర్‌వైజర్లు, మైక్రో అబ్జర్వర్లకు శిక్షణా తరగతులు కౌంటింగ్ అబ్జర్వర్ దిలీప్ సింగ్ కోహిల్ నిర్వహించి కౌంటింగ్ నిర్వహణపై సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా కౌంటింగ్ అబ్జర్వర్ మాట్లాడుతూ నారాయణపేట జిల్లాలోని నారాయణపేట,మక్తల్ నియోజకవర్గాల అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి డిసెంబర్ 3న ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని తెలిపారు. ఈ కౌంటింగ్ నిర్వహణకు విధులు కేటాయించిన కౌంటింగ్ సిబ్బంది నిస్పక్షపాతంగా కౌంటింగ్ ప్రక్రియను నిర్వహించేందుకు భారత ఎన్నికల సంఘ వారి ఎన్నికల నియమావళిపై రూపొందించిన మాన్యువల్‌పై పూర్తి అవగాహనను ఏర్పరచుకుని పకడ్బందీగా ఎన్నికల కౌంటింగ్ జరపాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర అత్యంత కీలమని అన్నారు. అబ్జర్వర్ల పరిధిలో పని చేయుటకు మైక్రో అబ్జర్వర్లు విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. బ్యాంకు సిబ్బంది మాత్రమే మైక్రో అబ్జర్వర్లుగా వ్యవహరిస్తారన్నారు. అసెంబ్లీ ఈవిఎంల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి కేటాయించిన కౌంటింగ్ సిబ్బంది అధికారులు కౌంటింగ్ మాన్యువల్‌లోని ప్రతి అంశంపై అవగాహన అవసరమని తెలుపుతూ సందేహాలను నివృత్తి చేశారు. శిక్షణ తరగతుల అనంతరం కౌంటింగ్ సూపర్‌వైజర్స్ సహాయ సూపర్‌వైజర్లకు ప్రాక్టికల్‌గా డమ్మి కౌంటింగ్ ప్రక్రియు కౌంటింగ్ పర్సనల్స్‌చే చేయించి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ శిక్షణ తరగతులలో ఆర్డీఓ రామచంద్ర, మాస్టర్ ట్రైనర్ డిఆర్డిఓ గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కౌంటింగ్ అబ్జర్వర్



హాజరైన కౌంటింగ్ సిబ్బంది

# నూతన ఎక్సైజ్ పాలసీ షురూ..

- అమల్లోకి 2023-25 మద్యం పాలసీ
- నవంబర్ 30తో ముగిసిన గడువు
- ఉమ్మడి జిల్లాలో నాలుగు డివిజన్లు..
- 14 సర్కిళ్లు, 230 వైన్స్‌షాపులు

**నూతన ఎక్సైజ్ పాలసీ 2023-25 మద్యం పాలసీ అమల్లోకి వచ్చింది. గత టెండర్లు 2021-23కు సంబంధించి నవబంబర్ 30తో గడువు ముగిసింది. దీంతో 2023-25 మద్యం పాలసీకి సంబంధించి మూడు నెలల ముందుగానే తెలంగాణ ప్రభుత్వం ఆగస్టు నెలలో నోటిఫికేషన్ విడుదల చేసి టెండర్ల నిర్వహించి లక్కీ డిప్ ద్వారా దుకాణాలను కేటాయించింది. దీంతో శుక్రవారం నుంచి నూతనంగా మద్యం దుకాణాలు పొందిన వ్యాపారులు తమ షాపులను కొనసాగించనున్నారు.**

**- మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్ 1, ప్రభాతవార్త**



గత 2021డిసెంబర్‌లో ప్రారంభమైన మద్యం దుకాణాల కాలపరిమితి రెండేండ్లు పూర్తి అయింది. ఇందులో భాగంగా 2023నవంబర్ 30వ తారీఖు నాటికి మద్యం పాలసీ ముగియడంతో ఎక్సైజ్ శాఖ టెండర్లు నిర్వహించి నూతన మద్యం దుకాణాలకు అనుమతి ఇచ్చింది. తెలంగాణ ప్రభుత్వం గత రెండేండ్ల కిందట నూతన మద్యం పాలసీని తీసుకొచ్చింది. ఇందులో భాగంగా కీలకంగా కొన్ని మార్పులు చేసింది. నూతన మండలాల్లో మద్యం దుకాణాలను సైతం పెంచింది. టెండర్‌దారులకు 21 ఏండ్లు నిండాలి. ఒక వ్యక్తి ఎన్ని షాపులకైనా దరఖాస్తు చేసుకోవచ్చు. గతంలో నాలుగు స్లాబుల్లో లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉండగా నూతన మద్యం పాలసీ ద్వారా ఆరు స్లాబుల్లో లైసెన్స్ ఫీజు చెల్లించే విధంగా చర్యలు తీసుకున్నారు.

**మద్యం షాపుల్లో రిజర్వేషన్..** ఎస్సీ, ఎస్టీ, గౌడ కులస్తులకు కేటాయించిన షాపుల్లో మాత్రం ఆ కేటగిరీలకు చెందిన వారే దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. ఎస్టీలకు 5శాతం, ఎస్సీలకు 10శాతం, గౌడ్లకు 15శాతం చొప్పున రిజర్వేషన్ అమలు చేస్తూ గతంలో ఉత్తుర్వులు కూడా ఇవ్వడం జరిగింది. వారు దరఖాస్తుతోపాటు కుల ధ్రువీకరణ పత్రం జత చేయాల్సి ఉంటుంది.

**నాలుగు డివిజన్లు,14 సర్కిళ్లు ..**

**ఉమ్మడి జిల్లాలో మొత్తం నాలుగు డివిజన్లు**

మహబూబ్‌నగర్,నాగర్‌కర్నూల్,వనపర్తి,గద్వాల ఉన్నాయి. జడ్చర్ల, కోస్గి, మహబూబ్‌నగర్, నారాయణపేట, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, తెలకపల్లి, ఆత్మకూరు, కొత్తకోట, వనపర్తి, అలంపూర్, గద్వాల కలిపి 14 సర్కిళ్లున్నాయి. ఉమ్మడి జిల్లాలో నాలుగు సర్కిళ్లలో 230 మద్యం దుకాణాలు ఉన్నాయి. మహబూబ్‌నగర్, నారాయణపేట కలిపి 90వైన్‌షాపులు ఉండగా, నాగర్‌కర్నూల్‌లో 67, వనపర్తిలో 36, జోగుళాంబ గద్వాలలో 37 మద్యం షాపులు ఉన్నాయి.

**ఎన్నికల నేపథ్యంలో ..**

ఈసారి 2023-25 మద్యం పాలసీ గడువులోనే అసెంబ్లీ ఎన్నికలు, సర్పంచుల ఎన్నికలు, ఎంపీ ఎన్నికలు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ ఎన్నికలు రానున్నాయి. ఎన్నికల వేళ ఎక్కువ మద్యం విక్రయాలు జరిపి లాభాలు అధికంగా గడించవచ్చనే ఆలోచనతో మద్యం దుకాణాల నిర్వహణపై ఆసక్తి పెరిగింది. దీంతో గత మూడు నెలల కింద నిర్వహించిన టెండర్లలో అత్యధికంగా టెండర్ల నమోదు కావడం గమనార్హం. 2021-23 మద్యం పాలసీలో ఉమ్మడి జిల్లాలో 4718 టెండర్లు వచ్చాయి. అంటే ఒక్కో టెండర్‌కు రూ.2లక్షల దరఖాస్తు చొప్పున ఎక్సైజ్ శాఖకు 94.36కోట్ల ఆదాయం వచ్చింది. 2023-25 మద్యం పాలసీలో 8607 దరఖాస్తులు రావడం గమనార్హం. ఇదిలా ఉండగా సిండికేట్ అయినా కూడా మద్యం దుకాణాలు రాని వ్యాపారులు షాపులను కొనుగోలు చేసినట్లు తెలుస్తుంది. అయితే ఆయా ప్రాంతాలు, అక్కడ ఉండే మద్యం విక్రయాల ప్రకారం ఒక్కో మద్యం షాపును రూ.25లక్షల నుంచి కోటి వరకు కూడా పలికినట్లు సమాచారం. అయితే షాప్ పొందిన లైసెన్స్ హోల్డర్ నుంచి అగ్రిమెంట్ చేసుకొని దుకాణాలు నిర్వహించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు వ్యాపార వర్గాల సమాచారం.

# నువ్వా.. నేనా..?

**గెలుపు బిఆర్ఎస్ అభ్యర్థి నిరంజన్ రెడ్డి దా ?**

**లేక కాంగ్రెస్ అభ్యర్థి మేఘా రెడ్డి దా ?**

**బీజేపీకి ఈ సారైనా**

**ఓటు బ్యాంకు అయినా వచ్చేనా...**

**ప్రజలు ఎవరిని అసెంబ్లీకి పంపిస్తారో**

**వనపర్తి ప్రతినిధి,డిసెంబర్ 1,ప్రభాతవార్త :** హీటెక్కించిన విమర్శలు...హోరెత్తించేలా ప్రచారాలు..ఎవరికి వారే ఓటర్లను ప్రసన్నం తంటాలు..కచ్చితంగా తామే గెలుస్తామనే ధీమా.అభివృద్ధి తామే చేశామని..మరో అవకశాం ఇస్తే ఇంకా చేస్తామని,చేసిందేమీలేదని..తమకు అధికారం ఇస్తే సిసలైన అభివృద్ధి చూపిస్తామని..ఇలా హామీల మీద హామీలతో సై అంటూ ఎన్నికల సమరంలో దూకారు.మరి వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గ ప్రజా తీర్పు ఎలాద ఉండదబోతుందో..ప్రజలు ఎవరిని అసెంబ్లీకి పంపిస్తారో 3 వరకు వేచి చూడాల్సి ఉంది.

ముగ్గురిలో గెలుపేవరిది... ?

బీఆర్ఎస్ నుంచి కేసీఆర్ కు కుడిభూజకంగా,ఎమ్మెల్యే మంత్రిగా అనుభవం ఉన్న సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మరోసారి పోటీ చేశారు.కాంగ్రెస్ తరపున తూడి మేఘా రెడ్డి బరిలో నిలిచారు.అయితే మొదట మాజి మంత్రి.చిన్నా రెడ్డికి కాంగ్రెస్ టికెట్ వచ్చినప్పటికి.రెండో జాబితాలో తూడి మేఘా రెడ్డికి అధిష్టానం టికెట్ కేటాయించడం పట్ల కాంగ్రెస్తో తీవ్ర వ్యతిరేకత చోటుచేసుకుంది.ఇక బీజేపీ తరపున బీజేవైఎం జిల్లా నాయకులు అనుజ్ఞ రెడ్డి బరిలో నిలిచారు.

కాంగ్రెస్ ప్రచారానికి అంటి ముట్టనట్లుగా చిన్నా రెడ్డి...?

వనపర్తి కాంగ్రెస్ అభ్యర్థి టికెట్ ఆశించిన మాజి మంత్రి.చిన్నా రెడ్డికి మొదట టికెట్ వచ్చిన.సర్వే ఫలితాల కారణంగా రెండో విడుతలో టికెట్ తూడి మేఘా రెడ్డికి వచ్చింది.దీంతో చిన్నా రెడ్డి నిరుత్సాహనికి లో నయ్యారు.కొద్ది రోజుల పాటు చిన్నా రెడ్డి,ఆయన వర్గం కాంగ్రెస్ పార్టీ కార్యాక్రమాలకు తూరంగా ఉన్నారు.మేఘా రెడ్డికి టికెట్ వచ్చిన ప్రచార కార్యక్రమాలకు చిన్నా రెడ్డి.ఆయన వర్గం అంటి ముంటనట్లుగా ఉంటూ వచ్చారు.చిన్నా రెడ్డి వర్గం మేఘా రెడ్డికి సహకరించలేదన్న ఆరోపణలు వినిపించాయి.ఈ ఎన్నికల్లో మేఘా రెడ్డి గాలి ఎంత వరకు పని చేసిందో ఫలితాల వరకు చూడాల్సి ఉంది.

బీజేపీకి ఈ సారైనా ఓటు బ్యాంకు పెరిగేలా...?

రాష్ట్రం మొత్తం బీజేపీ గాలి విస్తుంటే వనపర్తి నియోజకవర్గంలో మాత్రం ఆ ఊసే కనిపించలేదు.గత ఎన్నికల్లో బీజేపీ 3 వేల పైచిలుకు ఓట్లు మాత్రమే వచ్చాయి.ఈ సారి బరిలో ఉన్న బీజేపీ అభ్యర్థి.అనుజ్ఞ రెడ్డి కి గత ఓట్ల కంటే ఎక్కువగా వచ్చే అవకాశం కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

రెండో సారి నిరంజన్ రెడ్డి గెలిచేనా...?

కేసీఆర్ కు కుడి బుజం,గత ఎన్నికల్లో 50 వేల మెజార్టీతో గెలుపొందిన నిరంజన్ రెడ్డి ఈ సారి కష్ట కాలం వచ్చి పడింది.వనపర్తిలో మేఘా రెడ్డి కి వచ్చిన ఆదరణ.నిరంజన్ రెడ్డి పై ప్రజల్లో వచ్చిన వ్యతిరేకత వల్ల ఈ సారి ఎన్నికల్లో గెలుస్తారో లేదో వేచి చూడాల్సి ఉంది.

77.72 శాతం ఓటింగ్

వనపర్తి నియోజకవర్గంలో పురుష ఓటర్లు 1,35,654.మహిళా ఓటర్లు 1,35,491...ఇతరులు ఓటర్లు 6...మొత్తంగా మొత్తం ఓటర్ల సంఖ్య..2,71,151 కాగా..ఈ సారి ఎన్నికల్లో 1,06,606 పురుషులు,1,04,132 మంది మహిళలు,ఇతరులు 01 కలిపి మొత్తం 2,10,739 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.దాదాపు ఈ సారి 72.72 శాతం పోలింగ్ నమోదు అయ్యింది.







# ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను అత్యంత పకడ్బందిగా నిర్వహించాలి..

**-నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ కుమార్ దీపక్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 01 ప్రభాతవార్త:** డిసెంబర్ 03న ఆదివారం నిర్వహించే అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్‌ను అత్యంత పకడ్బందిగా జాగ్రత్తగా ఈవీఎంల కౌంటింగ్ ప్రక్రియను నిర్వహించాలని అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిసెంబర్ 3న నాగర్‌కర్నూల్ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో 3 నియోజకవర్గాల కౌంటింగ్ నిర్వహణలో భాగంగా కౌంటింగ్ విధులు నిర్వహించే కౌంటింగ్ సహాయ కౌంటింగ్ సూపర్‌వైజర్లు, మైక్రో అబ్జర్వర్లకు 2వ విడత శిక్షణ తరగతులు నిర్వహించి కౌంటింగ్ నిర్వహణపై సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలోని నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట నియోజకవర్గాల అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి డిసెంబర్ 3న వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని తెలిపారు. ఈ కౌంటింగ్ నిర్వహణకు విధులు కేటాయించిన కౌంటింగ్ సిబ్బంది నిష్పక్షపాతంగా కౌంటింగ్ ప్రక్రియను నిర్వహించేందుక భారత ఎన్నికల సంఘం వారి ఎన్నికల నియమావళిపై రూపొందించిన మాన్యువల్‌పై పూర్తి అవగాహన ఏర్పరుచుకొని పకడ్బందిగా ఎన్నికల కౌంటింగ్ జరుపాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర అత్యంత కీలకమైన ఉంటుందన్నారు. అబ్జర్వర్ల పరిధిలో పనిచేయుటకు మైక్రోట అబ్జర్వర్లు విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. బ్యాంక్ సిబ్బంది మాత్రమే మైక్రో అబ్జర్వర్లుగా వ్యవహరిస్తారన్నారు. మాస్టర్ ట్రైనర్ బాలరాజు మాట్లాడుతూ అసెంబ్లీ ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి కేటాయించిన కౌంటింగ్ సిబ్బంది, అధికారులు కౌంటింగ్ మాన్యువల్‌లోని ప్రతి అంశంపై అవగాహన అవసరమని తెలుపుతూ సందేహాలను నివృత్తి చేశారు. శిక్షణ తరగతుల అనంతరం కౌంటింగ్ సూపర్‌వైజర్స్ సహాయ సూపర్‌వైజర్లకు ప్రాక్టికల్స్‌గా డమ్మీ కౌంటింగ్ ప్రక్రియను కౌంటింగ్ పర్సనల్స్ చేయించి వారి సందేహాలను నివృత్తి చేశారు. శిక్షణ తరగతుల్లో ఎన్నికల శిక్షణా పర్యవేక్షణ నోడల్ అధికారి నర్సింగ్‌రావు, ఎల్‌డీఎం. కౌశల్ కిశోర్ పాండే, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు ఉన్నారు.





అబ్జర్వర్లకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

# అవగాహనతోనే ఎయిడ్స్ అడ్డుకట్ట..

**జిల్లా వైద్యాధికారి.జయచంద్ర మోహన్**

**వనపర్తి ప్రతినిధి,డిసెంబర్ 1,ప్రభాతవార్త :** మహమ్మారి ఎయిడ్స్ వ్యాధి అవగాహనతోనే అడ్డుకట్ట వేయవచ్చని జిల్లా వైద్యాధికారి. జయచంద్ర మోహన్ అన్నారు.ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం వనపర్తి జిల్లా వైత్య ఆరోగ్య శాఖ సమావేశ గదిలో జరిగిన అవగాహన సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.జయప్రదం మోహన్ మాట్లాడుతు ఎయిడ్స్ వ్యాధి అంతం మనందరి బాధ్యత అని,ఎయిడ్స్ వ్యాధి కలిగిన రోగిని ప్రేమతో వారిలో ధైర్యమైన లక్షణాలను తెలుపాలన్నారు.యోగా,ధాన్యం,వివిధ అహరపు అలవాటు ద్వారా వారి యొక్క జీవితం పెంచుకోవచ్చున్నారు.సమాజంలో ఎయిడ్స్ నియంత్రణ,సలహాలు,అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు.అనంతరం ఎయిడ్స్ నియంత్రణ కు సేవ చేసిన వారికి ప్రశంస పత్రాలు,మెమోంట్ లు అందించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటి వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రీనివాసులు,ప్రోగ్రాం అధికారి సాయినాథ్ రెడ్డి,ప్రోగ్రాం అధికారులు డా.పరిమళ,డా.మంజుల,నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ఇందిరా జానసిబాయ్,ప్రాధమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు,మాస్ మీడియా ఆధికారి చంద్రయ్య,నర్సింగ్ అధికారి శ్రీధర్ రెడ్డి,రవీందర్,జె మధు,చంద్రయ్య,నర్సింగా రావు,మహేశ్వర్ చారి,వెంకట్ కౌన్సిలర్ సురేందర్ రెడ్డి,నర్సింగ్ కాలేజీ విద్యార్థులు,సిబ్బంది పాల్గొన్నారు.





మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి.జయచంద్ర మోహన్

# స్ట్రాంగ్ రూముల వద్ద మూడంచల భద్రత..

**మొదటి పేజీ తరువాయి భాగం..**

నుండి వీక్షించి రక్షణ అధికారులకు ఎల్లవేళల సూచనలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల నియమావళి ప్రకారం అనుమతి ఉన్న ప్రత్యేక అధికారులే సందర్శిస్తూ ఎప్పటికప్పుడు రక్షణ చర్యలు చేపడుతున్నారు. సందర్శించిన అధికారి పేరు, వెళ్లిన సమయం, తప్పనిసరిగా భద్రత అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక రిజిస్టార్లలో పొందుపరుస్తూ సంతకాలను సేకరిస్తారు. ఎల్లవేళలా అప్రమత్తంగా ఉంటే రాత్రి సమయంలో పెట్రోలింగ్ గస్తీ పకడ్బందీగా నిర్వహిస్తూ భద్రత చర్యలను సమీక్షిస్తూ ఉండాలని ఇంఛార్జి అధికారులకు సూచించారు.



స్ట్రాంగ్ రూముల వద్ద గస్తీ నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది

### కాంగ్రెస్ పార్టీ విజయఢంకా

# మోగించడం ఖాయం...



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ మోతిలాల్‌నాయక్

**వెల్దండ, డిసెంబర్ 01 ప్రభాతవార్త:** రాష్ట్రంలో మార్పు కోసం జరిగిన ఎన్నికల సంగ్రామంలో కాంగ్రెస్ పార్టీ విజయఢంకా మోగిస్తుందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోతిలాల్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండల కాంగ్రెష్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజారంజక పాలన దిశగా కాంగ్రెస్ పార్టీ ఎన్నో అభివృద్ధి పథకాలను రూపొందించి ప్రజాభివృద్ధికి పెద్దపీట వేసిందని ఆయన తెలిపారు. దేశ వ్యాప్తంగా అధికార పార్టీల బీజేపీ, బీఆర్ఎస్ పాలనలో ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసి, దేశ సంపదను మొత్తం కాజేసే లక్ష్యంతో పనిచేసిన మోడీ, కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ఫలితాలే చెంపపెట్టుగా రాబోతున్నాయని ఆయన పేర్కొన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొందుతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికారంలో కాంగ్రెస్ పార్టీ రాగానే కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధి, చివరి ఆయాకట్టు వరకు సాగునీరు అందించడం వేగవంతమవుతోందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ వైపు నడిచి మద్దతు నిలిచిన ప్రతి ఒక్కరికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తాలూకా కిసాన్ సెల్ అధ్యక్షులు పర్వత్‌రెడ్డి, నాయకులు పుల్లయ్య, రామస్వామి, బాణావత్ శంకర్, అంజయ్య, రాజు,సర్యానాయక్, గోపాల్‌నాయక్, కొమ్ము అంజయ్య, రామస్వామి, గోపాల్, రవినాయక్ కోటి తదితరులు ఉన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



**యాచారం డిసెంబరు1,ప్రభాతవార్త :** సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంగా మారిందని పలువురు పేర్కొన్నారు. శుక్రవారం యాచారం మండల పరిధిలోని తాడిపర్తి గ్రామానికి చెందిన మదేల నరసింహ్మకు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి సహకారంతో మంజూరైన 18వేల రూపాయల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు మల్లేష్ ,పోలేవుని పాండు,సినియర్ నాయకులు పరికిసాన్ రెడ్డి,దార అంజయ్య,పిఎస్ఎస్ బ్యాంకు డైరెక్టర్ మదేల శశికళ,తదితరులు పాల్గొన్నారు.

## తలకొండపల్లి మండలంలో 86శాతం పోలింగ్

**తలకొండపల్లి డిసెంబరు1,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండలంలో గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మండలంలో మొత్తం 86శాతం మేరకు పోలింగ్ జరిగినట్లు మండల అభివృద్ధి అధికారి శ్రీధర్, ఎంపిడివో శ్రీకాంత్ తెలిపారు. తలకొండపల్లి మండలంలో మొత్తం 39 పోలింగ్ స్టేషన్‌లో 36వేల 768 ఓట్లు ఉన్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని గ్రామాల వారీగా అత్యధికంగా దేవునిపడకల్ పోలింగ్ బూత్‌లో 1086 ఓట్ల గాను 1004ఓట్లతో 92.4శాతం రెండో స్థానంలో మొదక్‌పల్లి పోలింగ్ బూత్‌లో 907ఓట్లకు గాను 826 ఓట్లతో 91.8 శాతం ఓట్లతో రెండో స్థానంలో పోలింగ్ నమోదైనట్లు తెలిపారు. మండలంలో మొత్తం 39 బూతులలో 36వేల 768 ఓట్ల గాను 31వేల 628 ఓట్ల చొప్పున 86.0శాతం పోలైనట్లు వారు తెలిపారు.

## నేడు పూడూరు మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం

**పూడూరు, డిసెంబర్ 1, ప్రభాతవార్త :** ఈనెల 2వతేదీన (నేడు)పూడూరు మండల పరిషత్తు సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ సూపరింటెండెంట్ వరలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు ఎంపిపి మల్లేశం అద్యక్షతన మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి మండలంలోని వివిధ గ్రామాల ఎంపిటిసిలు,సర్పంచులు సకాలంలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

## హెచ్ఐవీ పట్ల జాగ్రత్తలు వహించాలి

### - షాద్‌నగర్‌లో ఎయిడ్స్ అవగాహన ర్యాలీ



ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తు ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

**షాద్‌నగర్ డిసెంబర్ 1, ప్రభాతవార్త :** డిసెంబర్ 1 ఎయిడ్స్ డేను పురస్కరించుకొని షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో షాద్‌నగర్ డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి ఆదేశానుసారం పట్టణ ముఖ్యకూడలీలో శుక్రవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు డాక్టర్లు మాట్లాడుతూ... ఎయిడ్స్‌పై పూర్తి అవగాహన కల్పించారు. హెచ్ఐవీ వ్యాపించే విధానాలు, వాటిని అరికట్టే పద్దతులను వివరించి ప్రజల్లో చైతన్యం నింపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యూకేటర్ డాక్టర్ శ్రీనివాసులు, ఆప్తల్మిక్ ఆఫీసర్ శ్రీహరి, హెల్త్ సూపర్‌వైజర్ పుష్ప, ఐసీటీ సెంటర్ శ్యాంసుందర్, ఆశోక్, వైద్య సిబ్బంది మాధవి,ఝాన్సీ, శ్రీలత, శ్రీశైలం, ఆన్వర్, శ్రీధర్‌రెడ్డి, రవి, వేమారెడ్డి పాల్గొన్నారు.

## చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి భీమ్ భరత్ గెలుపు ఖాయం

**శంకర్‌పల్లి, డిసెంబర్ 1 ప్రభాతవార్త:** చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి భీమ్ భరత్ గెలుపు ఖాయమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భానూరి కృష్ణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య కుటుంబ పాలన అంతం చేసేందుకు నియోజకవర్గం ప్రజలు ఆలోచించి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశారని అన్నారు. నియోజకవర్గం ప్రజలు అభివృద్ధిని కోరుకున్నారు కాబట్టి కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తున్నారని పేర్కొన్నారు. కాగా రాష్ట్రంలో కూడా అధిక మెజార్టీతో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ పాలనలోనే పేదలకు న్యాయం జరుగుతుందని అన్నారు.

## ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా

**షాబాద్, డిసెంబర్ 1, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సమిష్టిగా పనిచేసినందుకు అందరికి అండగా ఉంటానని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్ అన్నారు. శుక్రవారం షాబాద్ మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో టీపీసీసీ కార్యదర్శులు పీసరి సురేందర్‌రెడ్డి, రాంరెడ్డిలతో కలిసి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... మీకన్న బిడ్డలా చేరదీసినందుకు ప్రతి ఒక్కరికి చేతులెత్తి మొక్కుతున్నానన్నారు. కాంగ్రెస్ పార్టీని ఆదరించి అమానించి రేయింబవళ్లు కష్టపడి పనిచేసినందుకు ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానన్నారు. ఎన్నికల్లో తనతో పాటే సైనికుల్లా సేవలందించిన కార్యకర్తలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ గాలివీస్తుందని, సర్వేలు కూడా కాంగ్రెస్ పార్టీకి శుభసూచికం చూపిస్తున్నాయన్నారు. పార్టీ నాయకులతో పాటు అన్ని విభాగాల కార్యకర్తలకు, ఎన్నికల్లో బాగా పనిచేసిన వారందరికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రతి కార్యకర్తకు ఏ అవసరం వచ్చిన అండగా ఉంటానని భరోసా నిచ్చారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ మల్లేష్, నాయకులు రాఘవరెడ్డి, తమ్మలి రవీందర్, అక్తర్‌పాష, గడ్డం చంద్రయ్య,పీసరి వెంకట్‌రెడ్డి, వేణుగోపాల్, పెంటారెడ్డి, పామెన నర్సింలు, చెన్నయ్య, రమేష్, రాజు, గౌతం, మాజీ సర్పంచులు యాదగిరి, బుచ్చయ్య ,సత్యనారాయణ, ఆయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పామెన భీంభరత్

# కబ్జాలకు గురవుతున్న నదీ నాలాలు

### -కుచించుకుపోతున్న వాగు,వంకలు ప్రశ్నార్థకంగా మారుతున్న భవిష్యత్తు

**కందుకూరు, డిసెంబర్ 1, ప్రభాతవార్త:** రియల్‌ల్టర్‌లు వ్యాపార దృక్పథంతో చేపడుతున్న నిర్మాణాలు భవిష్యత్తును ప్రమాదాలోకి నెట్టబడుతున్నాయి. రాష్ట్ర రాజదానికి కూతవేటు దూరంలో ఉన్న కందుకూరు మండలం దినదినాభి వృద్ధి సాదిస్తుండగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు దృష్టి సారించారు. ఈ ప్రాంతంలో భూమలు దరలు ఎక్కువగా ఉండడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు తక్కువ దరలకు వచ్చే భూములపై దృష్టి సారిస్తున్నారు. వారు సేకరించే భూములు గృహనిర్మానాలు చేయడానికి అనువుగా ఉన్నాయా వెంచర్‌లు చేయవచ్చా అనే అలోచన చేయడం లేదు. వ్యాపారమే పరమావదిగా భావించే వ్యాపారులు నదీ నాలాలైనా వంపు ప్రాంతమైనా వంద్రు నేలలైనా మనకెందుకు వెంచర్ చేశామా రంగు రంగు బ్రోచర్‌లతో వినియోగదారులను అకర్షింప జేశామా అంటే పైపైన వెంచర్ నిర్మాణం పనులను చేస్తు వినియోగదారులను అకర్షిస్తు రంగుల మాయతో వినియోగదారులను బోల్తా కొట్టిస్తున్నారు. మండల పరిదలో కొత్తూరు, గూడూరు, కందుకూరు రెవెన్యూ గ్రామాల పరిదిలోకి వచ్చే ప్రాంతాలలో నదీనాలాల పక్కన, వంపు ప్రాంతాలలో వెలసిన, వెలస్తున్న వెంచర్‌లు నీటి ప్రవాహలకు ఎలా నిలుస్తాయనేది ప్రశ్నార్థకంగా మారింది. సుదూర ప్రాంతాలలో ఉండే వినియోగదారులు ఈ వాస్తవికతను గుర్తించక మొసపోతున్నారు. గూడూరు గ్రామానికి వెళ్లే దారిలో వెలసిన ఒక వెంచర్ వంపు ప్రాంతంలో ఏర్పాటు చేయడం జరిగింది. వర్షాలు పడితే వరద ప్రవహించే



వరద ప్రవాహం ఎక్కువగా ఉండే వంపు ప్రాంతంలో వెలసిన వెంచర్

మార్గానికి అడ్డుగా వెంచర్ నిర్మానం చేసి వెంచర్‌చుట్టు ప్రహరీ గోడను నిర్మించడం జరిగింది. ఇటీవలి కాలంలో అ మార్గం గుండా ప్రవహించిన వరదనీరు హైద్రాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిని గంటల తరబడి స్తంబింప చేసింది. అలాగే దానికి సమీపంలో కొత్తూరు వాగుపక్కన భూమిని కొనుగోలు చేసిన వారు అభివృద్ధి పనులలో బాగంగా ప్రహరీ గోడ నిర్మానం చేపట్టి వారి పొలం పక్కనుండి వెలుతున్న కొత్తూరు వాగుఅంచులను పూడుస్తు వాగు వెడల్పును తగ్గిస్తు ప్రహరీ గోడనిర్మానాన్ని చేపట్టడం జరుగుతుంది. ఈ వాగు సుదూర ప్రాంతం నుండి ప్రవహిస్తు వస్తుంది. వర్షాలు కురిస్తే అయా చెర్వులు కుంటలనుండి పెద్దమొత్తంలో నీరు ప్రవహిస్తు ఈవాగుగుండా వెల్లి ఇబ్రాహింపట్నం చెర్వులోకి నీరు చేరుతుంది. ఇలా నదీ పారివాహక ప్రాంతాలను వంపుప్రాంతాలను అక్రమనలకు గురిచేస్తు భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తున్నారు. వాగులు వంకలు కుచించుకుపోతే వరదనీరు ఎక్కువైతే అమార్గంగుండా వెల్లే వరదనీరు పంటపొలాలను ముంచెత్తే పరిస్తితులు నెలకొన్నాయి, ప్రమాదాలు విపత్తులు జరుగనప్పుడు అంతా బాగుంటుంది. ఏదైనా జరుగరానిది జరిగితే భాద్యత ఎవ్వరు తీసుకుంటారనేది ప్రశ్నగా మితులుతుంది. రాష్ట్ర రాజదాని హైద్రాబాద్‌లో అనాడు ఇలాంటి అక్రమ పద్దతులకు తెరలేపడంవలన రియల్టర్‌లు వంపు ప్రాంతాలను, నదీనాలాలను అక్రమించి ప్లాట్టుచేసి అభంశుభం తెలియని అమాయకులకు కట్టబెట్టి చేతులు దులుపుకున్నారు. అనాడు కోటిఅశలతో ప్లాట్లు కొన్న వారు ఇండ్లు నిర్మించుకుని సాఫీగా ఉందనుకునే సమయంలో విపత్తులు సంబవించగానే నేడు పడరాని పాట్లు పడుతున్నారు. పలు సందర్భాలలో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని కాలంవెల్లదీసే పరిస్తితులు చూస్తున్నాము. ?ఇలాంటి పరిస్థితుల నుండి ప్రజలను కాపాడవలసి అధికార యంత్రాంగం వాస్తవ పరిస్తితులను గుర్తించకుండా రియల్టర్ల ప్రయోజనాలకు పెద్దపీటవేస్తున్నారు. నిబందనలు తుంగలో తొక్కుతు అంతా బాగుందన్న చందంగా వెంచర్లు చేయడానికి ప్లాట్లు వేయడానికి అనులమతులు ఇవ్వడం జరుగుతుంది. దానితో అమాయ ప్రజలు అనుమతులు అన్ని ఉన్నాయన్న అలోచనతో ప్లాట్లు కొని మోసపోతున్నారు. ఈ విషయంలో పాలకులు అలోచించాలని అక్రమాలకు పాల్పడుతున్న వారిపైన ఖటినచర్యలు తీసుకోవాలని అమాయకులు మొసపోకుండా చర్యలు చేపట్టాలని భవిష్యత్తులో ఎలాంటి ఉపద్రవాలు సంభవించకుండా చర్యలుతీసుకోవాలని రియల్టర్‌లకు వత్తాసు పలుకుతు వాస్తవాలను చూడకుండా అనుమతులు ఇచ్చేవారిపైన చర్యలు తీసుకోవాలని అమాయక ప్రజలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



కొత్తూరు వాగు వెడల్పు తగ్గేలా మట్టి నింపుతు ప్రహరీ నిర్మిస్తున్న దృశ్యం

# రొంపల్లిలో యువతదే పై'చేయి'

### -ర్యాలీగా వాళ్లి ఓటింగ్‌లో పాల్గొన్న వందమంది యువకులు
### -మరికొన్ని గ్రామాల్లో పోటాపోటిగా



ఓటు వేశాక బయటికి వచ్చి గుర్తును చూపుతున్నా యువత

**బంట్వారం,డిసెంబర్ 1 (ప్రభాతవార్త) :** మండలంలో గురువారం జరిగిన పోలింగ్‌లో ఆసక్తికర విషయాలు వెలుగు చూస్తున్నాయి. దీన్ని బట్టి చూస్తే రాష్ట్రవ్యాప్తంగా వెలువడుతున్నా ఎక్సిట్ పోల్స్ నిజమనిపిస్తుంది. మండల పరిధిలోని రొంపల్లి గ్రామంలో సుమారు వంద మంది యువకులు నినాదలిస్తు ర్యాలీగా వెళ్ళి ఓటింగ్‌లో పాల్గోనడం ఒకింత ఆశ్చర్యానికి గురిచేసింది. దీన్ని బట్టిచూస్తే అధికార పార్టీని కంగారు పెట్టెలా, కాంగ్రేస్ పార్టీకి జోష్ నింపేలా ఉందని చర్చలు కొనసాగుతున్నాయి. రొంపల్లిలో కాంగ్రేస్ పై చేయి సాదిస్తుందని యువత తమ లభిప్రాయాన్ని వ్యక్తం వెలిబుచ్చుతున్నారు. ఇదే పరిస్థితి అన్ని మండలాల్లో ఇలాగే ఉంటె వికారాబాద్‌లో కాంగ్రేస్ విజయఢంఖ మోగిస్తుందని కాంగ్రేస్ శ్రేణులు ధీమాగా సంభురాలకు సిద్దమవుతున్నారు. బంట్వారం మండల వ్యాప్తంగా పోలింగ్ సరళిని, పలువురు పార్టీల నాయకులు, ఓటర్ల లభిప్రాయలను శుక్రవారం క్రోడికరించి పరిశీలించగా, అధికార బీఆర్ఎస్ పార్టీ, కాంగ్రేస్‌ల మద్య మాత్రమే పోటి ఉంది. అయితె మద్యం, డబ్బులు అనుకున్నంతగా పనిచేయలేదని తెలుస్తుంది. అనేక గ్రామాల్లో పోటాపోటిగా పోరు ఉండగా, రోంపల్లి గ్రామంలో రాలీగా వెళ్ళిన యువకులు కాంగ్రేస్ నినాదాలు చేస్తు పోనింగ్ బూత్‌లోకి చేరుకున్నారు. ఓటువేసిన అనంతరం బయటికి వచ్చి చేతి గుర్తును, విక్టరీ సింబల్ చూపడం కాంగ్రేస్ శ్రేణుల్లో ఉత్సహాన్ని నింపింది. ఇదే స్థాయిలో మాలసోమారంలో సైతం ఓటు వేశాక వచ్చినవారంత కాంగ్రేస్‌కు జిందాబాద్‌లు కొట్టడం, చేయి ఎత్తి గుర్తును చూపడం, మరికొంత మంది ఓటర్లు 'ఇక్కడ కారు నడవదు, చేయి పని చేస్తది' అంటు బహటంగానే చెప్పడంతోనే పలితం తెలిపోయిందని ఊరంత చెపుతున్నారు. ఇలా మరికొన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తుంది. ఇది ఇలా ఉంటే బంట్వారం, బొపునారం, గ్రామాల్లో మాత్రం అధికార పార్టీ నాయకులు, కాంగ్రేస్ నాయకులు తమదంటె, తమదే మేజారిటీ అంటు ధీమా వ్యక్తం చేస్తూన్నారు. రొంపల్లి, మాలసోమారం, తొరుమామిడి గ్రామాల్లో ఏ పార్టీకి మెజార్టీ వస్తే ఆ పార్టీకి మండలంలో మెజార్టీ ఉంటుందని, విజయావకాశాలు మెండుగా ఉంటాయని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. ఏది ఏమైన 3వ తారీఖు పలితాలు ఎవరిని ఎలా చేస్తుందో వేచిచూడాల్సిందే..

# ఎమ్మెల్యే పీఏ ఓవర్ యాక్షన్. !

### - పోలింగ్ కేంద్రాల వద్ద హాల్ చల్..
### - చితక బాదిన స్థానిక ప్రతిపక్ష నాయకులు

**తాండూరు, డిసెంబరు 1, ప్రభాతవార్త :** ఎక్కడైనా ఓ ప్రజాప్రతినిధి వ్యక్తి గత సిబ్బంది ఆ ప్రజా ప్రతినిధి చెప్పిన పనులను పూర్తి చేస్తూ.. ప్రజాప్రతినిధి వద్దకు వచ్చే వారికి అనుకూలంగా, సహాయకుడిగా పనిచేస్తుంటాడు.. కానీ వికారాబాద్ జిల్లా తాండూరులో స్థానిక ప్రజాప్రతినిధికి వ్యక్తిగత సిబ్బందిలో ఒకరిగా పనిచేస్తున్న ఆయన ఆ ప్రజా ప్రతినిధి కంటే తానే ఎక్కువ అన్నట్లుగా ఓవర్‌యాక్షన్‌గా పనిచేస్తుంటారని ఆరోపణలు ఉన్నాయి. ప్రజలు, నాయకుల్లో ఆయన ఆ ప్రజా ప్రతినిధికి పీఏ కంటే ఎక్కువ అన్నట్లు వ్యవహారిస్తుంటాడు. తాండూరులో స్థానిక ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి వద్ద పీఏగా శ్రావణ్ అనే వ్యక్తి పనిచేస్తుంటాడు. అయితే, ఆయన ఎమ్మెల్యే కంటే తన మాటే ఎక్కువ అన్నట్లుగా ఆ పార్టీ నాయకులతో, కార్యకర్తలతో దురుసుగానే ప్రవర్థిస్తారని ఆరోపణలు ఉన్నాయి. గురువారం స్థానిక అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎమ్మెల్యే కంటే ఎక్కువ ఆయన పీఏ శ్రావణ్ ఎక్కువ ఓవర్ యాక్షన్ చేసినట్లు తెలిసింది. దీంతో పట్టణంలోని సాయిపూర్‌లో పోలింగ్ కేంద్రం వద్ద శ్రావణ్ చేసిన ఓవర్ యాక్షన్‌ను బరించలేని ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆయనను చితకబాది దుమ్ము దులిపినట్లు తెలిసింది. శ్రావణ్‌ను చితకబాదిన వీడియోలు.. ఆయన చేసిన హాల్ చల్ వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. దీంతో ఆయన చేసిన ఓవర్ యాక్షన్‌కు ప్రజలే బుద్ధి చెప్పారని.. ఇటాంటి ఓవర్ యాక్షన్ తాండూరులో పనికిరాదని పలువురు చర్చించుకుంటున్నారు.



పోలింగ్ కేంద్రం వద్ద హాల్ చల్ చేస్తున్న ఎమ్మెల్యే పీఏ.

## కడ్మూరు శివాలయంలో వైభవంగా సామూహిక యజ్ఞాలు



కడ్మూరు శివాలయంలో సామూహిక యజ్ఞాలు జరుగుతున్న దృశ్యం

**పూడూరు, డిసెంబర్ 1, ప్రభాతవార్త :** పూడూరు మండలం పరిధిలోని కడ్మూరు గ్రామ శివాలయంలో శుక్రవారం సామూహిక యజ్ఞాలతోపాటు పలు కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. మూడు రోజులపాటు జరిగే కార్యక్రమాల్లో భాగంగా రెండవరోజు వేధపండితులు శివానందం, శివ, సంపత్‌కుమార్, ప్రవీణ్‌కుమార్,రాజుల అద్వర్యంలో యజ్ఞాలు నిర్వహించారు. మధ్యాహ్నం సమయంలో కడ్మూరు, మిట్టకంకల్ గ్రామాల భజన మండలీలు పాల్గొని రాకంచెర్ల శ్రీ వెంకటదాసుల వారి సంకీర్తనలు ఆలాపించారు. రాత్రి సమయంలో ఆలయంలో మహిళా భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని కార్తీక దీపాలంకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రధానోపాద్యాయుడు చిన్నికృష్ణ అద్వర్యంలో కడ్మూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులచే కోలాటం నృత్యాలు నిర్వహించారు. దీంతో గ్రామం అంతా శివనామ స్మరణతో మార్మోగింది. వేపచెట్టు యువజన సంఘం అద్వరయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పూజారులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శనివారం ఉదయం 6 గంటలకు కుంభాభిషేకం,10-30 గంటలకు శివపార్వతుల కళ్యాణం, సాయంత్రం 6గంటలకు స్వామివారి రథోత్సవం ఊరేగింపు,రాత్రి వివిధ గ్రామాలచే భజన కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.



పూడూరు మండలం కడ్మూరు శివాలయంలో కోలాటం వేస్తున్న విద్యార్థులు

## కొడంగల్‌లో 81.96 శాతం పోలింగ్

**కొడంగల్,డిసెంబర్ 1(ప్రభాతవార్త :** కొడంగల్ అసెంబ్లీ-72 స్థానానికి గురువారం జరిగిన ఎన్నికల్లో 81.96 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ రాత్రి వరకు కొనసాగింది. రాత్రి వరకు కొనసాగిన పోలింగ్‌లో 81.96శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారి లింగ్యానాయక్ తెలిపారు. కొడంగల్ నియోజకవర్గంలో 275 పోలింగ్ కేంద్రాలకు గాను మొత్తం 2,36,625 మంది ఓటర్లు ఉండగా అందులో 1,17,303 పురుషులు,1,19,310 మంది మహిళా ఓటర్లతో పాటు ఇతరులు 12 మంది ఉన్నారు. అందులో 96,403 మంది పురుషులు,97537 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం రాత్రి సమయంలో పోలింగ్ ఏజెంట్లత సమక్షంలో సీల్ చేసిన ఈవీఎంలను భారీ పోలీసు భద్రతల మద్య స్ట్రాంగ్‌రూంకు తరలించారు.

## ఓటరు దేవుళ్లకు కృతజ్ఞతలు

### -షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వీర్లపల్లి శంకర్

**నందిగామ డిసెంబర్1,ప్రభాతవార్త :** అసెంబ్లీ ఎన్నికల్లో తనను అదరించి, ఆశీర్వదించి,ఎన్నో వ్యయప్రయాసాల కోర్చి చేతి గుర్తుకు ఓటు వేసిన షాద్‌నగర్ నియోజకవర్గం ప్రజలందరికి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వీర్లపల్లి శంకర్ శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలిపారు. మీ ఓటుతో నన్ను గెలుపిస్తున్నారనే గెలుపు సంకేతా లు వినిపిస్తున్నాయని,మీ ఆదరాభిమానాలను ప్రేమ,అప్యాయత,అనురాగాలను నేన్నెడు మార్చిపోనని వీర్లపల్లి నియోజకవర్గ ప్రజలందరికి శిరస్సు వంచి పాదాభి వందనం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## అన్నదాన ప్రభువుకు సన్మానం



అన్నదాన ప్రభువు శ్రీను నాయక్‌ను సన్మానించిన ఆలయ కమిటీ నిర్వహకులు

**నందిగామ డిసెంబర్1,ప్రభాతవార్త :** నందిగామ మండలం శివారులో ఉన్న పరమ పవిత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో చాకలిధనిగుట్ట గ్రామపంచాయతీ వార్డు సభ్యులు జెట్టావత్ శ్రీను నాయక్ శుక్రవారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన ప్రభువు ప్రీను నాయక్‌ను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు హారీజీవన్,బి.సుదర్శన్ గౌడ్, బి.జంగయ్య గౌడ్,జెట్టావత్ లక్ష్మణ్ నాయక్,తదితరులు ఉన్నారు.

## మాడ్గులలో 82.31 శాతం పోలింగ్ నమోదు

**మాడ్గుల,డిసెంబర్01,ప్రభాతవార్త:-** కల్వకుర్తి నియోజకవర్గంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో మాడ్గుల మండలంలోని 50పోలింగ్ బూత్‌లలో 82.31శాతం ఓటింగ్ జరిగినట్లు తహశీల్దార్ నిరంజన్ రావు ఒక్క ప్రకటణలో తెలిపారు. మండలంలోని 43879 మంది ఓటర్లు ఉండగా 36116 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో మాడ్గుల మాడ్గుల మండలంలో 82.31 శాతం పోలింగ్ నమోదు అయినట్లు అయన తెలిపారు. ఈనెల 3న ఇబ్రహీం పట్నంలోని సివిఆర్ కాలేజీలో కౌంటింగ్‌కు ఎన్నికల అధికారులు పూర్తి ఏర్పటు చేస్తున్న తెలిపారు. దీంతో రేపు అభ్యర్థుల భవిష్యత్తు బయటపడనుంది.

## అందరినోట...వీర్లపల్లి గెలుపు మాట

### -సంబరాల్లో మునిగితెలుతున్న కాంగ్రెస్ శ్రేణులు
### -విందు,వినోదాలతో సంబరాలు

**నందిగామ డిసెంబర్1,ప్రభాతవార్త :** నందిగామ మండలంలో నువ్వా..? నేనా? రీతిలో ఉత్కంఠ భరితంగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వీర్లపల్లి శంకర్ గెలుపు ఖాయమైందని కాబోయే మన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అని కాంగ్రెస్ శ్రేణులు, కార్యకర్తలు,అభిమానులు ఆనంద సంబరాల్లో మునిగి తెలారు. ఈ నెల మూడవ తేదిన జరిగే ఎన్నికల కౌంటింగ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి వీర్లపల్లి సుమారు పదిహేను వేలపైగా మోజార్టీతో గెలవబోతున్నారని దీమా వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఏ గల్లి చూసిన,ఏ కాలనీలో విన్న ఏ ఊరిలో ,ఏ తండాలో,బస్‌స్టాప్‌లో రైల్వే స్టేషన్‌లో ఇదే మాట జననేత వీర్లపల్లి గెలుపుతో షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజల కు మంచి రోజులు రానున్నాయని శంకర్ గెలుపు ఖాయమనే దీమాతో మండలంలో కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు ,సంబరాలు జరుపుకుంటున్నారు.

# కొడంగల్‌లో గెలుపుపై ఎవరి ధీమా వారిదే !

**కొడంగల్,డిసెంబర్ 1(ప్రభాతవార్త** అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా రాష్ట్రంలోనే అందరి దృష్టిని ఆకర్శించిన కొడంగల్ నియోజకవర్గంలో గెలుపుపై ఎవరిధీమా వారిదే అనే తీరులో ఆసక్తిని రేకెత్తిసుంది. ఇక్కడ గెలుపుపై ఇటు బీఆర్ఎస్ అటు కాంగ్రేస్ పార్టీలు ప్రతిష్టాత్మక ంగా తీసుకోవడంతో ఇరు పార్టీలు సర్వశక్తులు ఓడ్డి పోటాపోటీగా ప్రచారాలతో హోరెత్తించారు. అంతేగాక ఇరు పార్టీల అధినేతలు కొడంగల్ స్దానంపై ప్రత్యేక దృష్టిని సారించడంతో పాటు రాష్ట్ర,జాతీయ అదినేతలు సైతం తమ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారాలు చేపట్టి పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారు. అనంతరం ఎన్నికల గడువు సమీపిస్తున్న కొద్ది నియోజకవర్గంలో కోట్లాది నగదుతో పాటు మద్యం ఏరులై పారించారు. గురువారం ఎన్నికల ఓటింగ్ ముగియడంతో పాటు అభ్యర్థుల భవితవ్యం ఈవీఎం మిషన్‌లలో నిర్లిప్తం కావడంతో అభ్యర్దులు ఓటింగ్ సరళిపై దృష్టి సారించారు. మండలాల వారిగా పోలైన ఓటింగ్ సరళి విధానంపై నాయకులను అడిగి తెలుసుకుంటు లెక్కలు వేసుకుంటాన్నారు. ఫలానా మండలంలో ఓట్ల సరళి తమ పార్టీకే అనుకూలంగా ఉందంటే కాదు తమకే అనుకూలంగా ఉంటుందంటూ ఆయా పార్టీల ద్వితీయ శ్రేణీ నాయకులు లెక్కలేసుకునే పనిలో నిమగ్నమైయ్యారు. 8 మండలాలకు సంబందించిన ఓటింగ్ విధాన సరళిని నిశితంగా గమనిస్తు తమదే విజయం ఖాయమని ఓ పార్టీ నాయకులు చెబుతుంటే కాదు పక్కాగా తమదే విజయమని మరో పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో ఏ నోటా విన్నా అభ్యర్దుల గెలుపు ఓటములపైనే చర్చోప చర్చలు కొనసాగుతున్నాయి. వీటితో పాటు ఈ సారి ఎన్నికల్లో వలస ఓటర్లు అత్యధికంగా పాల్గొనడంతో తమకే అనుకూలమంటూ అధికార పార్టీ నాయకులు అంటుంటే కాదు తమకే అనుకూలంగా ఓటు వేశారని ప్రతిపక్ష పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. వీటితో పాటు ఈ సారి నూతనంగా ఓటుహక్కు నమోదు చేసుకున్న యువత తమ వైపే మొగ్గుచూపారంటూ ఓ పార్టీ నాయకులు పేర్కొంటుండగా కాదు యువత మద్దతు మాకే ఉన్నట్లు స్పష్టం అవుతున్నదని మరో పార్టీ నాయకులు పేర్కొంటుండడం విశేషం.

మరోపక్క గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి డబ్బుల ప్రభావం అధికంగా ఉండడంతో ఒక్కో ఓటుకు 2 వేల నుంచి 5 వేల వరకు ఇచ్చేందుకు కూడ అభ్యర్దులు వెనుకాడలేదని స్పష్టంగా తెలుస్తుంది.

కేవలం వలస ఓటర్ల కోసమే ఓ పార్టీ అభ్యర్థి సుమారు కోటి రూపాయల దాకా ఖర్చు చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

ఏదిఏమైనా గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి ఎన్నికల్లో గెలుపుకోసం కోట్లలో ఖర్చుచేసిన అభ్యర్దుల భవితవ్యం తేలాలంటే మరో రెండు రోజులు వేచి చూడాల్సిందే మరి.